RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక 18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:19 THURSDAY ,MAY 21 ,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :19 గురువారం, మే 21, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## నేటి నుంచి సరస్వతి అంత్యపుష్కరాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి



సరస్వతి అంత్య పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నా మని వివరించారు. బుధవారం వరంగల్ లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కంచి పీఠాధిపతి విజయేంద్రస్వామితో కలిసి కొండ సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం బయట మంత్రి కొండా సురేఖ విలేకర్లతో మాట్లాడుతూ ఈ అంత్య పుష్కరాలకు రూ. 200 కోట్లకు- మిగతా2లో

## నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

### పరిశ్రమల శాఖ పై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఫ్యూచర్ సిటీల పరిశ్రమల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులుకు సంబందించి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే - మిగతా2లో

## సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు.. 66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు





తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఆపరేషన్ ఆక్టోబస్ 3.0లో భాగంగా సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు అందిస్తున్న 66 మందిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు 13 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించారు. ఘోస్ట్ సిమ్ కార్డులతో దేశవ్యాప్తంగా ఎన్నో సైబర్ నేరాలు - మిగతా2లో

## యువతి కిడ్నాప్ కేసు..

### ఎఫ్ఐఆర్‌లో కీలక అంశాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి



అత్తాపూర్‌లోని జోయ్ ఆస్పత్రి వద్ద యువతి కిడ్నాప్ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు. హాస్పిటల్ హౌస్ కీపింగ్ సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. యువతిని కిడ్నాప్ చేసిన వాహనాన్ని అత్తాపూర్‌నుంచి ఆరంఘర్ చౌరస్తా వరకు ఛేజ్ చేసినప్పటికీ కిడ్నాపర్లు పారిపోయారు. - మిగతా2లో

## గుడ్ న్యూస్ లింక్ డాక్యుమెంట్లు అవసరం లేదు కేవలం పన్ను రశీదు ఆధారంగా రిజిస్ట్రేషన్..!



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా గ్రామకంఠం భూములకు సంబంధించి నెలకొన్న రిజిస్ట్రేషన్ల ఇబ్బందులకు ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన - మిగతా2లో

## సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

తెలంగాణ పత్రిక ప్రతినిధి



భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్లు తెలుస్తోంది. న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ సమావేశాలకు పుతిన్ హాజరవుతారని దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. జిన్‌పింగ్ కూడా ఈ సమావేశాలకు హాజరయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. - మిగతా2లో

## ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

తెలంగాణ పత్రిక ప్రతినిధి



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్లెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధం పై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు - మిగతా2లో

## చిల్డ్ అవుదామని బీర్ కొంటే.. లోపల ఊహించని వస్తువు! చూసి షాకైన మద్యం ప్రియుడు!




తెలంగాణ పత్రిక ప్రతినిధి

సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట్ భూంపల్లిలో ఒక విస్తుపోయే ఘటన వెలుగుచూసింది. రోజంతా కష్టపడి అలసిపోయిన ఒక స్థానిక వ్యక్తి, సాయంత్రం కాస్త రిలాక్స్ అవుదామని స్థానిక వైన్ - మిగతా2లో

## రుతుపవనాలు వచ్చేస్తున్నాయ్.. తెలుగు రాష్ట్రాల్లో వచ్చే 3 రోజులు వాతావరణం ఎలా ఉంటుంది..



తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్న వేళ వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. రాబోయే 3-4 రోజుల్లో నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగే అవకాశం ఉందని వెల్లడించింది. తెలంగాణ,- మిగతా2లో

## రేషన్ కార్డు ఉంటే అకౌంట్లోకి రూ.5 లక్షలు..

### తెలంగాణ ప్రభుత్వం కొత్త పథకం.. జూన్ 2 నుంచే..

తెలంగాణ పత్రిక ప్రతినిధి




తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీపికబురు అందించింది. వచ్చే నెల జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వస్తోంది. ఆ రోజున అనేక కొత్త సంక్షేమ పథకాలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని అమలు చేయనుంది. తెలంగాణ ప్రజలకు రేవంత్ సర్కార్ భారీ గుడ్ న్యూస్ అందించనుంది. జూన్ 2వ తేదీన కీలక పథకానికి శ్రీకారం చుట్టనుంది. - మిగతా2లో

## నేటి నుంచి సరస్వతి అంత్యపుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరంలో జరిగే ఈ సరస్వతి పుష్కరాల్లో ప్రతి రోజు సాయంత్రం గోదావరి హారతి ఇస్తారని చెప్పారు. లాగే ఈ పుష్కరాల సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని కొండా సురేఖ వివరించారు. ఈ పుష్కరాల సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున సేవలందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బాసర నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వరకు దేవాలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మే 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు ఈ అంత్య పుష్కరాలు జరుగనున్నాయి.

## ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

-మొదటిపేజీ తరువాయి

తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ యుద్ధానికి సంబంధించిన నిర్ణయాల పై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు అని వ్యాఖ్యానించారు.

## సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం

-మొదటిపేజీ తరువాయి

విడుదల చేయలేదు. జిన్‌పింగ్ భారత పర్యటన పై ఇప్పటికే అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. 2019లో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ తరువాత 2020లో గాల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలు, 2022లో తవాంగ్ బోర్డర్ వద్ద ఉద్రికత్తల కారణంగా కొంతకాలం పాటు పరిస్థితులు గంభీరంగా మారాయి. ఆ తరువాత రష్యాలో కజాన్ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ, జిన్‌పింగ్‌లు సమావేశమయ్యారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం విషయంలో బ్రిక్స్ కూటమిలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్న వార్తల నడుమ తాజా సమావేశాలకు రష్యా, చైనా అధినేతలు హాజరుకానున్నారు.

## సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు.. 66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు

-మొదటిపేజీ తరువాయి

చేసినట్లు గుర్తించారు. పద్దెనిమిది బృందాలతో ఏడురోజుల పాటు ఈ ఆపరేషన్‌ను కొనసాగించగా, 1,194 ఘోస్ట్ సిమ్ కార్డులను గుర్తించి, వాటిలో 544 కార్డులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. సైబర్ నేరగాళ్ళకు 20 మంది పీవోఎస్ ఏజెంట్లు సహకారం అందించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 10 మంది వోడాఫోన్ ఐడియా, ఏడుగురు ఎయిర్‌టెల్, ముగ్గురు జియో పీవోఎస్ ఏజెంట్లను అరెస్టు చేశారు. సిమ్ కోసం వచ్చిన వారికి తెలియకుండా మరో సిమ్ యాక్టివేట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

## చిల్డ్ అవుదామని బీర్ కొంటే.. లోపల ఊహించని వస్తువు! చూసి షాకైన మద్యం ప్రియుడు!

-మొదటిపేజీ తరువాయి

ఇంటికి వెళ్లి ఎంతో ఇష్టంగా తాగుదామని సీల్ తీసి, బీరును గ్లాసులో పోస్తుండగా అతనికి ఊహించని షాక్ తగిలింది. ఆ బాటిల్ లోపల ఒక ఖాళీ కండోమ్ ప్యాకెట్ స్పష్టంగా తేలుతూ కనిపించింది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట్ భూంపల్లిలో ఒక విస్తుపోయే ఘటన వెలుగుచూసింది. రోజంతా కష్టపడి అలసిపోయిన ఒక స్థానిక వ్యక్తి, సాయంత్రం కాస్త రిలాక్స్ అవుదామని స్థానిక వైన్ షాపులో ఒక ప్రముఖ బ్రాండ్‌కు చెందిన బీరు బాటిల్ కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి ఎంతో ఇష్టంగా తాగుదామని సీల్ తీసి, బీరును గ్లాసులో పోస్తుండగా అతనికి ఊహించని షాక్ తగిలింది. ఆ బాటిల్ లోపల ఒక ఖాళీ కండోమ్ ప్యాకెట్ స్పష్టంగా తేలుతూ కనిపించింది. అది చూసి సదరు వ్యక్తి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యాడు. బాటిల్ లోపల అది స్పష్టంగా తేలుతూ కనిపించడంతో ఆ వ్యక్తి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఈ విషయాన్ని వైన్ షాప్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా, స్థానికంగా ఇది పెద్ద చర్చకు దారి తీసింది..దీంతో మద్యం ప్రియులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన పై మద్యం ప్రియులు,స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్త కాస్తా చుట్టుపక్కల ప్రాంతాల్లో తెగ వైరల్ అయింది. బ్రాండెడ్ కంపెనీలు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా బీరు బాటిళ్లను ఎలా ప్యాక్ చేస్తున్నాయంటూ మద్యం ప్రియులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయాన్ని అందిస్తున్న మద్యం తయారీ విషయంలో ఇంతటి నిర్లక్ష్యమా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి ఘటనలు ప్రాణాలకే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీల బాటిలింగ్ యూనిట్లలో తక్షణమే కఠిన తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘోర నిర్లక్ష్యంపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలా స్పందిస్తారో, సదరు కంపెనీపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

-మొదటిపేజీ తరువాయి

జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకు స్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్-1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# యువతి కిడ్నాప్ కేసు.. ఎఫ్ఐఆర్‌లో కీలక అంశాలు

-మొదటిపేజీ తరువాయి

కారుకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో వివరాలు సేకరించడం సవాల్‌గా మారింది. 'రాత్రి 10:45 నిమిషాలకు ఆస్పత్రిలోని ఈఆర్ బ్లాక్ వెనుక భయాందోళనతో ఓ యువతి పరుగెత్తింది. యువతిని ఓ గుర్తు తెలియని వ్యక్తి వెంబడించాడు. సెల్లార్ వైపు పరిగెత్తిన యువతిని మా హాస్పిటల్ సిబ్బంది గమనించారు. 'నాకు ప్రమాదం ఉంది' అంటూ యువతి బాత్రూంలో దాక్కుంది. నన్ను కాపాడండి.. వాళ్లు నన్ను వెంబడిస్తున్నారు అంటూ యువతి ఆర్తనాదం చేసింది. సెక్యూరిటీ గార్డులను సహాయం చేయాల్సిందిగా యువతి కోరింది. హాస్పిటల్ ఎదురుగా ఆపి ఉన్న థార్ కారు దగ్గర అనుమానిత వ్యక్తులు ఉన్నారు. వారు యువతిని చూపించి 'మా అమ్మాయి' అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బంధువు అంటూ యువతిని తీసుకెళ్లేందుకు అనుమానితులు ప్రయత్నించారు. వారి బెదిరింపులతో యువతి భయపడింది. ఆమె ఇష్టం లేకుండానే.. దుండగులు బెదిరించి బలవంతంగా కారు ఎక్కించారు. హాస్పిటల్ ప్రాంగణం నుంచే యువతిని బలవంతంగా తీసుకుని వెళ్లారు' అంటూ ఫిర్యాదు పేర్కొన్నారు.

**యువతి ఫోన్ నంబర్ ట్రేస్..**

అత్తాపూర్ కిడ్నాప్ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కిడ్నాప్‌కు గురైన యువతి ఫోన్ నంబర్‌ను పోలీసులు ట్రేస్ చేశారు. జోయ్ హాస్పిటల్ పక్కనే ఉన్న రత్నదీప్ సూపర్ మార్కెట్లో కొన్ని వస్తువులను యువతి కొన్నట్టు సీసీటీవీ కెమెరాల ద్వారా గుర్తించారు. రాత్రి 10:30 గంటలకు క్లోజింగ్ టైమ్‌లో వెళ్లి వాటర్ బాటిల్, చాక్లెట్స్, కొన్ని స్నాక్స్‌ను యువతి కొన్నట్లు తెలుస్తోంది. ఆ టైంలో జరిపిన ట్రాన్సాక్షన్ ఆధారంగా యువతి నంబర్‌ను పోలీసులు ట్రేస్ చేశారు. ఆమె కొనుగోలు చేసిన వస్తువులకు ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్టు గుర్తించారు. దీంతో ఫోన్ పే నోడల్ అధికారిని పోలీసులు వివరాలు అడిగారు. కాసేపట్లో ఫోన్ పే నోడల్ అధికారి నుంచి యువతి వివరాలు రానున్నట్లు పోలీసులు తెలిపారు. యువతి వివరాలు వస్తే కేసు డిటెక్ట్ అయినట్టే అని పోలీసులు చెబుతున్నారు.

## గుడ్ న్యూస్ లింక్ డాక్యుమెంట్లు అవసరం లేదు కేవలం పన్ను రశీదు ఆధారంగా రిజిస్ట్రేషన్..!

-మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా గ్రామకంఠం భూములకు సంబంధించి నెలకొన్న రిజిస్ట్రేషన్ల ఇబ్బందులకు ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. దీనివల్ల వంశపారంపర్యంగా వస్తున్న ఇళ్లు, ఖాళీ స్థలాల యజమానులకు భారీ ఉపశమనం లభించనుంది. సాధారణంగా గ్రామాల్లోని నివాస ప్రాంతాలను 'గ్రామకంఠం'గా పిలుస్తారు. వాస్తవానికి ఇవి ప్రభుత్వ భూములు కావు, కానీ వెబ్‌లాండ్ రికార్డుల్లో స్పష్టమైన సబ్-డివిజన్ లేకపోవడం వల్ల చాలా చోట్ల ఇవి 22ఏ (నిషేధిత జాబితా)లో ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయి. దీనివల్ల వారసత్వంగా వస్తున్న ఆస్తులను అమ్ముకోవాలన్నా, వేరొకరికి బదలాయించాలన్నా రిజిస్ట్రేషన్ శాఖ అంగీకరించేది కాదు. పైగా పాత ఇళ్లకు సంబంధించి లింకు డాక్యుమెంట్లు లేకపోవడం పెద్ద అడ్డంకిగా మారింది. నిషేధిత జాబితాతో సంబంధం లేదు: వెబ్‌లాండ్ రికార్డుల్లో ఏదైనా సర్వే నంబరు 'గ్రామకంఠం' అని ఉంటే, అది 22ఏ జాబితాలో ఉన్నా లేకున్నా రిజిస్ట్రేషన్ చేయవచ్చు. దీనికి ప్రత్యేకంగా ప్రభుత్వం నుంచి మినహాయింపు కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదు. పన్ను రశీదులే ప్రామాణికం: ఇల్లు ఉండి, ఎలాంటి లింకు దస్తావేజులు లేని పక్షంలో.. స్థానిక సంస్థలు పంచాయతీ లేదా మున్సిపాలిటీ జారీ చేసిన ఇంటి పన్ను రశీదును ఆధారం చేసుకుని రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఖాళీ స్థలాలకు వెసులుబాటు: పట్టణ ప్రాంతాల్లో లింకు డాక్యుమెంట్లు లేని వంశపారంపర్య ఖాళీ స్థలాలకు ఖాళీ స్థల పన్ను రశీదును ప్రామాణికంగా తీసుకోవాలి. లింకు డాక్యుమెంట్లు తప్పనిసరి కాదు: పాత ఆస్తులకు లింకు డాక్యుమెంట్లు ఉండవు కాబట్టి, వాటి కోసం దరఖాస్తుదారులను వేధించకూడదని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించింది. గ్రామాల్లోని ఖాళీ స్థలాలకు పన్ను రశీదులు కూడా లేని పక్షంలో, రిజిస్ట్రేషన్ పత్రంలోనే 'స్వయం ధ్రువీకరణ' పొందుపరిచే వెసులుబాటు కల్పించారు. సదరు ఆస్తి తమకు వారసత్వంగా వచ్చిందని, దానిని తాము అనుభవిస్తున్నామని, అది 22ఏ పరిధిలోకి రాదని యజమాని స్వయంగా ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇందుకోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని ఒత్తిడి చేయకూడదని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామాల్లో, పట్టణాల్లోని పాత నివాస ప్రాంతాల్లో ఆస్తులు ఉన్న లక్షలాది మందికి లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా భూముల క్రయవిక్రయాలు సజావుగా సాగడమే కాకుండా, ఈ ఆస్తులపై బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం కూడా కలుగుతుంది. 2026 ఫిబ్రవరి 17న ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది.

## రుతుపవనాలు వచ్చేస్తున్నాయ్.. తెలుగు రాష్ట్రాల్లో వచ్చే 3 రోజులు వాతావరణం ఎలా ఉంటుంది..

-మొదటిపేజీ తరువాయి

మరోవైపు వడగాలులు కూడా కొనసాగనున్నాయని హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రికార్డు స్థాయిలో 44 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. ఎండలతోపాటు.. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. రాబోయే 3-4 రోజులలో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 4.5 కి.మీ. ఎత్తులో, ఆగ్నేయ అరేబియా సముద్రం నుండి లక్షద్వీప్, ఉత్తర కేరళ,దక్షిణ అంతర్గత కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు ఒక ద్రోణి విస్తరించి ఉంది. నిన్నటి ద్రోణి ఇప్పుడు తూర్పు ఉత్తరప్రదేశ్‌పై ఉన్న ఆవర్తనం నుండి ప్రారంభమై, తూర్పు మధ్యప్రదేశ్ విదర్భల మీదుగా ఉత్తర ఉత్తరప్రదేశ్‌లోని మధ్య భాగాల నుండి ఉత్తర తెలంగాణ వరకు, సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి ఉంది. నిన్న దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలపై, సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కి.మీ. ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీనపడింది. ఆగ్నేయ అరేబియా సముద్రం (దక్షిణ లక్షద్వీప్ ప్రాంతాన్ని ఆనుకుని) నుండి కేరళ, దక్షిణ అంతర్గత కర్ణాటక, రాయలసీమ మీదుగా, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న ఆవర్తనం వరకు విస్తరించి ఉన్న నిన్నటి ద్రోణి సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కి.మీ ఎత్తుల మధ్య ఇప్పుడు బలహీనపడింది. వీటి ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రాగల 3 రోజులకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి.. బుధవారం, గురువారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది.

## రేషన్ కార్డు ఉంటే అకౌంట్లోకి రూ.5 లక్షలు.. తెలంగాణ ప్రభుత్వం కొత్త పథకం.. జూన్ 2 నుంచే..!

-మొదటిపేజీ తరువాయి

అదే ఇందిరమ్మ జీవిత బీమా పథకం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన ఈ పథకం ప్రారంభించేందుకు రేవంత్ సర్కార్ సమాయత్తం అవుతోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని పేదలకు రూ.5 లక్షల బీమా అందించనుంది. రేషన్ కార్డు ఉన్నవారందరికీ ఈ పథకం వర్తించనుంది. కుటుంబ యజమాని మరణిస్తే కుటుంబసభ్యులకు రూ.5 లక్షల సాయం అందించనుంది. దీంతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలను కూడా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

**జూన్ 2 నుంచి అమలు**

ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు చేసేందుకు జూన్ 2న ఎల్ఐసీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకునే అవకాశముందని తెలుస్తోంది. గతంలో ఆ స్కీమ్ గరించి మీడియా సమావేశంలో రేవంత్ వెల్లడించారు. జూన్ 2 నుంచి దీనిని అమలు చేస్తామని ప్రకటించారు. త్వరలో గడువు తేదీ దగ్గర పడుతుండటంతో పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పీడ్ పెంచింది. దీంతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలను కూడా కాంగ్రెస్ సర్కార్ ప్రారంభించనుంది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు కొత్త పింఛన్లను అందించలేదు. దీంతో 2 లక్షల మందికి కొత్తగా పింఛన్లు అందించాలని ప్రభుత్వం చూస్తోంది. పింఛన్ పెంపుపై కూడా ఓ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.

**రెండో దశ ఇళ్లకు నిధులు**

ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రెండో దశ ఇళ్ల మంజూరుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రెండో దశలో చేపట్టనున్న ఇళ్ల నిర్మాణాలకు జూన్ 2వ తేదీ నుంచి నిధులు విడుదల చేయనుంది. అంతేకాకండా అదే రోజున మరో కార్యక్రమం కూడా చేపట్టనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబసభ్యులు డిజిటల్ హెల్త్ కార్డులను అందించనున్నారని తెలుస్తోంది. ఈ కార్డులతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ పొందవచ్చు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులకు ఈ స్కీమ్ అమలు చేసేందుకు ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలాగే కార్డులను జారీ చేసేందుకు డేటాను కూడా సేకరించింది. మే 31లోగా డేటా సేకరణ ప్రక్రియ పూర్తి కానుంది. ఇక జూన్ 2న సనత్ నగర్ టిమ్స్ ప్రారంభం, నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి పొందేలా శిక్షణ వంటి కార్యక్రమాలు ప్రారంభించనుంది.

# ఏడాదికి ఒక్కసారే వికసించే వింత పుష్పం.. కనువిందు చేస్తున్న ఫుట్‌బాల్ లిల్లీ

19 తెలంగాణ పత్రిక

ప్రకృతిలో ఎన్నో వింతలు, విశేషాలు. కొన్ని మొక్కలు నిత్యం పూలు పూస్తే, మరికొన్ని మాత్రం ఏడాదికి ఒక్కసారి మాత్రమే వికసించి తమ ప్రత్యేకతను చాటుకుంటాయి. అచ్చం అలాంటి అరుదైన పుష్పమే స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్. దీనిని సాధారణంగా ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అని పిలుస్తుంటారు. ఇది కేవలం మే నెలలో మాత్రమే ఒకేసారి పూస్తది గ్రామంలో అందరిని కనువిందు చేస్తుంది వివరాల్లోకి వెళ్తే ఓదెల మండలంలో ని పెద్ద కొమిర గ్రామానికి చెందిన పత్రికా రిపోర్టర్దపని సుదర్శన్ మాధవిల పూల గార్డెన్‌లో ఈ పుష్పాలు వికసించి అందరినీ అబ్బురపరుస్తున్నాయి. ఏడాదికి ఒక్కసారే వికసించే వింత పుష్పం. పూలవనంలో కనువిందు చేస్తున్న ఫుట్‌బాల్ లిల్లీ నువ్వు మా ఇంటిలో వికసించడం ఎంతో ఆనందంగా ఉందని భూగోళంపై జీవించే ప్రతి జీవికి ఏదో ఒక ప్రత్యేకత కలిగి ఉంటుంది. అలాగే ఏడాది లో కేవలం ఒకే సారి పూసే అరుదైన మొక్క ఒకటి. ఆ మొక్క పుష్పాలు కేవలం మే నెలలోనే వికసించి అందరినీ ఆకట్టుకుంటాయి. పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలంలోని పెద్ద కొమిర గ్రామానికి చెందిన మండల ఓ పత్రిక రిపోర్టర్ పని సుదర్శన్ మాధవి. ముదిరాజ్ దంపతుల పూల గార్డెన్ లో ఈ అరుదైన దృశ్యం దర్శనమిచ్చింది.

సంవత్సరంలో కేవలం మే మాసంలో ఒక్కసారి మాత్రమే పూసే స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్ పుట్బాల్ లిల్లీ వికసించింది. ఈ మొక్క వృక్షరాజ్యంలోని అమరిల్లిడేసి కుటుంబానికి చెందిది. ఈ దుంపకాండ మొక్క శాస్త్రీయ నామం స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్ కాగా భారత దేశంలో ఈ మొక్కను పుట్బాల్ లిల్లీ, బ్లడ్ లిల్లీ అనే పేర్లతో పిలుస్తుంటారు. బ్రిటిష్ కాలం నాటి నుండి ఈ మొక్క ఉనికి దేశంలో ఉంది. ఆసక్తి తో పదేళ్ల క్రితం ఈ మొక్క దుంపను తెచ్చి కుండీలో నాటారు సుదర్శన్ ప్రతి ఏటా మే నెలలో ఒక్క పువ్వు మాత్రమే వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. జూన్ నెల వరకు ఈ పుష్పాలు ఉంటాయని ఆ తరువాత అవి రాలి పోతాయి. ఆ తర్వాత వచ్చిన ఆకులు జనవరి వరకు మాత్రమే ఉండి ఎండిపోతాయి. కేవలం దుంప మాత్రమే మట్టిలో దాగి ఉండి మే నెలలో మొగ్గలు తోడిగి పువ్వులు వస్తాయని, అందుకే మే పుష్పం అని పిలుస్తారని సుదర్శన్ చెప్పారు. ఒక్క సారి దుంప నేలలో పాతితే



ఈ మొక్కకు మరణం ఉండకపోవడం విశేషం. ఇక సుదర్శన్ మాధవి ఇంట్లో ఫుట్ బాల్ లిల్లీ వికసించిన సమాచారం తెలుసుకొని గ్రామస్తులు చూసేందుకు క్యూ కట్టారు. అరుదైన పుష్పాన్ని చూసి అందరూ ముచ్చటపడుతున్నారు. ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన 'లిల్లీ' కనిపించి చేస్తాను ఇది మా ఇంట్లో పుయ్యడం ఎంతో ఆనందంగా ఉంది అని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# గౌడన్న లకు ప్రభుత్వం అండగా ఉంటుంది





-పల్లె దవాఖానా తో ప్రజల చెంతకు మెరుగైన వైద్యం....ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

తెలంగాణ పత్రిక మే 20 జగిత్యాల జిల్లా ప్రతినిధి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన ను ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అంతకుముందు గ్రామంలో ప్రమాద వశాత్తు దగ్ధం అయిన ఈత వనాన్ని పరిశీలించి,కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని,సంబంధిత అధికారులకు ఫోన్ చేసి న్యాయం చేయాలని అన్నారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,డిఎంహెచ్ఓ సుజాత,ఎమ్మార్వో నాగార్జున ఎంపీడీవో చిరంజీవి,డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్,సర్పంచ్ నిరటి శ్రీనివాస్,మోర హనుమండ్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్ రావు,కోల శ్రీనివాస్ రవీందర్ రెడ్డి,ఉప సర్పంచ్ సాయి రెడ్డి,మాజీ సర్పంచ్ సామల వేణు,జలంధర్, మర్తిపెల్లి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు జవ్వాజి నర్సయ్య గౌడ్, సాయ గౌడ్,లక్ష్మణ్ గౌడ్,అరవింద్ గౌడ్, శేఖర్ రెడ్డి,యం ఏ ముకీద్,తిరుపతి గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బెజ్జంకి మోహన్, వార్డు సభ్యులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల గ్రామ నాయకులు,వైద్య సిబ్బంది , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంట మార్పిడి తగ్గిస్తే చీడపీడల సమస్య తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చు

-వ్యవసాయ శాస్త్రవేత్త సతీష్ చంద్ర

తెలంగాణ పత్రిక మే 20

ఓదెల మండలంలోని పోత్క పల్లి గ్రామ రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 99 రోజుల కార్యచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ పరిశోధన స్థానం కూనారం వ్యవసాయ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి సతీష్ చంద్ర పాల్గొన్నారు ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక సాగు పద్ధతులపై ప్రతి రైతుకు అవగాహన ఉండాలని రైతులు యూరియా మరియు రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి పంట మార్పిడి పద్ధతిని పాటించినట్లయితే చీడపీడల సమస్య తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చు అని పేర్కొన్నారు మార్కెట్లో అధిక గిరాకీ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు గడించవచ్చని రైతులకు తెలిపారు ఈ నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు అవసరం మేరకే రసాయన మందులు వాడడం ద్వారా వివిధ పంటల్లో ఖర్చులను కొంతవరకు తగ్గించుకోవచ్చని అదేవిధంగా ఎక్కువ రసాయనాలను పిచికారి చేయడం ద్వారా నేల నీరు గాలి కాలుష్యాన్ని గురి అవుతుందని గవర్నర్ ప్రతి రైతు సరైన సమయంలో సరైన మోతాదులో పిచికారి చేసుకోవడం వల్ల చీడపీడలను అరికట్టవచ్చని అన్నారు అదేవిధంగా ముఖ్యంగా సమగ్ర సస్యరక్షణ యజమాన్యం పద్ధతులను మరియు సాగునీటి ఆదా చేసుకునే వివిధ పంటలకు సాగు చేసుకోవచ్చని



తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబాల సారమ్మ కొమురయ్య తో పాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారి మౌనిక తో పాటు రైతులు పాల్గొన్నారు

# వచ్చే నెల 25 నుంచి ఇంటింటి సర్వే

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 20

జగిత్యాల జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని,జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు.జులై 31 నుంచి ఆగస్టు 30వరకు అభ్యంతరాలను స్వీకరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు.ఇంటింటి సర్వేలో ఓటర్ల వివరాల ధ్రువీకరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు,తొలగింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. కచ్చితమైన ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలుసహకరించాలని కలెక్టర్ అన్నారు.




# ఉపాధి హామీ కూలీలకు

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

- వార్డు సభ్యులు ఎండి షబ్బీర్



ఊర్కొండ మే 20 (తెలంగాణ పత్రిక)

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్వహిస్తున్నటువంటి ఉపాధి హామీ పనులలో భాగంగా ఊరకుంట చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామ వార్డు సభ్యులు ఎండి షబ్బీర్ అన్నారు.వేసవికాలం సుమారుగా 35 నుంచి 40 డిగ్రీల వరకు తీవ్రమైన ఎండ వేడిలో సుమారు 140 మంది పనిచేస్తున్న ఉపాధి హామీ పని కూలీలకు కనీసం మంచి నీళ్లు కూడా అందించడం లేదని నమ మాత్రంగా ఒక డబ్బా తెచ్చి పెడుతున్నారని.ఒక్కో రోజు అది కూడా లేకుండా పోతుందని కనీస మౌలిక వసతులు లేక నాన ఇబ్బందులు పడుతున్నారని.ఎండ తీవ్రతకు నీడకోసం షేడ్ నెట్ కూడా సరిగ్గా లేదని రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేని దౌర్భాగ్యం ఏర్పడిందని. ప్రమాదవశాత్తు పని ప్రదేశంలో అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే సరైన ప్రధమ చికిత్స చేయడానికి వసతులు కూడా ఏర్పాటు చేయలేదని. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలపై చిన్న చూపు చూడడం తగదని, గ్రామపంచాయతీ వ్యవస్థలోని అధికారులు,ఎన్నిక కాబడిన సర్పంచులు ఉపాధి హామీల కూలీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకొని ఉపాధి హామీల కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలియజేశారు.

# జగిత్యాల జిల్లాలో మెడికల్ షాప్ లు బంద్



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 20

దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు ఈరోజు మూతపడ్డాయి. అందులో భాగంగా మెడికల్ షాపులు జగిత్యాలలో పూర్తిస్థాయిలో స్వచ్ఛందంగా బందు పాటించారు. పెరిగిన ఏఐ వినియోగంతో ఆన్లైన్లో మందులు కొనుగోలు చేయడం మూలాన మెడికల్ షాపుల మనుగడ,తమ ఆర్థిక భద్రత సందిగ్ధంలో పడే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా యజమానులు తెలియజేశారు.ఆన్‌లైన్‌లో మందులు విక్రయించే ఈ-ఫార్మసీ సంస్థలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్,డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపు మేరకు రిటైల్ షాపులు బంద్ పాటించాయి.


# కళ్ళు పోతున్నాయి

-నరకంగా మారిన రాత్రి ప్రయాణం.

-ప్రమాదాలకు ప్రధాన కారణం ఎల్ఈడీ లైట్లు.

-సగం లైట్ స్టిక్కర్ నిబంధన జాడలేదు.

జగిత్యాల (తెలంగాణ పత్రిక) మే 20



రాత్రి 7గంటల తరువాత వాహనాలు నడపాలంటే భయమేస్తోంది.ఎదురొచ్చే వాహనాల ఎల్ఈడి లైట్స్ వల్ల కళ్లు కనిపించకుండపోతున్నాయి. కొత్తగా వచ్చే వాహనాలు ఎల్ఈడి లైట్స్ తో వస్తున్నాయి.ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ కరువు అయింది.నియంత్రణ జాడ ఎక్కడ కూడ లేకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం.గతంలో వాహనాల హెడ్ లైట్ కు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ ఉండాలన్న నిబంధన ఉండేది.అసలు ఆ రూల్ వుందో, లేదో,తీసేసారో కూడా తెలియట్లేదు ఎల్ఇడి లైట్ ల వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక,కళ్ళు మసకబారిపోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. కనుక సంబంధిత అధికారులు వాహనాల ఎల్ఈడి లైట్స్ గురించి చర్య తీసుకొని,కనీసం హెడ్ లైట్ల సగం వరకు బ్లాక్ స్టిక్కర్ కానీ, బ్లాక్ పెయింట్ కానీ వేయాలనే రూల్ ను పునరుద్ధరించాలి అని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 817వ. జీవోను వెంటనే రద్దు చేయాలి

-మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్ల సాయిలు డిమాండ్



కోటగిరి తెలంగాణ పత్రిక మే 20.

ఆన్లైన్ మందుల అమ్మకాల కోసం తెచ్చిన జీవోనంబర్ 817 ను వెంటనే రద్దు చేయాలని డిమాడ్ చేస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఇచ్చినా పిలుపుమేరకు బుధవారం దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణాలు బంద్ చేపట్టడం జరుగుతుందని కోటగిరి, పోతంగల్ మండలాల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి సితాలే విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆన్లైన్ ద్వారా మందులు విక్రయాలు చేయడం , అధికంగా డిస్కౌంట్ ఇవ్వడం ద్వారా నాసిరకమైన మందులు మార్కెట్లో చలామణి అవుతున్నాయని దీని ద్వారా చిన్న మెడికల్ షాప్ లపై తీవ్ర ప్రభావం చూపడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించిన పట్టించుకోకపోవడంతో దేశవ్యాప్తిగా మెడికల్ షాప్ ల బంద్ పాటిస్తున్నామని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 817 జివో ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగ భూషణం గౌడ్, దేవుడి సాయిలు, సాయ గౌడ్, నరేందర్, విట్టల్,లింగరాం, గోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్‌లో బంద్ విజయవంతం



రాయికల్ మండల మే 20(తెలంగాణ పత్రిక):

ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలు నియంత్రించాలని, కార్పోరేట్ సంస్థల డిస్కౌంట్ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తటపెట్టిన బంద్ విజయవంతం అయింది. రాయికల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీచౌక్, శివాజీ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి దుకాణాలు మూసివేయించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గరిపల్లి శ్రీనివాస్, సభ్యులు నాగమల్ల శ్రీకర్, శ్రీనివాస్, ఇమ్రాన్ హసం, విశ్వనాథం, రాంకిశోర్, రమేశ్, సాగర్, రాము, నర్సయ్య, హన్మంతు పాల్గొన్నారు.

## పెద్దపల్లి లోని మండల విద్యా వనరుల కేంద్రమును ఆకస్మికంగా తనిఖీ చేసిన

-విద్యాశాఖాధికారి జి.శారద



పెద్దపల్లి, ప్రతినిధి మే20 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద, సమగ్ర శిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ మల్లేష్ గౌడ్ బుధవారం రోజున పెద్దపల్లి మండల విద్యా వనరుల కేంద్రమును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన సిబ్బందిని గుర్తించి, అటెండెన్స్ రిజిస్టర్‌లో నమోదు చేయడం జరిగింది.?ఆకస్మిక తనిఖీ అనంతరం డిఈఓ ఎంఆర్‌సి సిబ్బందితో ఒక ప్రత్యేక రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జరుగుతున్న క్యాస్ట్ అప్డేటింగ్ విద్యార్థులు (2026-27) ఆన్‌లైన్ స్టేటస్‌ను క్షుణ్ణంగా విశ్లేషించి, పనులను వేగవంతం చేయడానికి తగిన సలహాలు, సూచనలు అందించారు. డిఈఓ కార్యాలయం నుండి వచ్చే ఆదేశాలకు సకాలంలో స్పందించి, అప్పగించిన విధులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే విధులు సక్రమంగా నిర్వహించని వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## బోధన్ గోషాలకు పశుగ్రాసం విరాళం అయాన్స్ పటేల్





పోతంగల్ తెలంగాణ పత్రిక మే 20.

పోతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రాజు పటేల్ మనవడు అయన్స్ పటేల్ తరుపున బోధన్ గోషాలకు 200 గడ్డి మోపులను (పశుగ్రాసం) విరాళంగా అందించడం జరిగిందని బిజెపి నాయకుడు పబ్బ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా పబ్బ శేఖర్ మాట్లాడుతూ...... తిర్మలాపూర్ గ్రామం నుండి నేటి వరకు 4 వందలు గడ్డిమోపులను గోశాలకు విరాళంగా అందించడం జరిగిందన్నారు. అయన్స్ కుటుంబ సభ్యులకు గోశాల కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారు ఎల్లకాలం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో దీవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పూజ పటేల్ అజయ్ పటేల్ గ్రామ పెద్దలు విజయ్ సాయి కృష్ణ కాశి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్. లక్ష్యం

-24 సంవత్సరాల తర్వాత తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

-బీఎల్ఏలను నియమించి బూత్ స్థాయిలో రాజకీయ పార్టీలు పర్యవేక్షణ చేయాలి

-జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహణ

-జూలై 31న డ్రాఫ్ట్, అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల

-రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ప్రతినిధి మే-20 ( తెలంగాణ పత్రిక )

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 24 సంవత్సరాల తర్వాత ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహించారని పేర్కొన్నారు.అక్టోబర్ 1, 2026ను ప్రమాణిక తేదీగా తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు కూడా ఈ ప్రక్రియలో భాగమని చెప్పారు. ప్రస్తుత ఓటర్ల జాబితాను 2002 నాటి ఎస్ఐఆర్ ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని తెలిపారు. 2002 తర్వాత కొత్తగా చేర్చిన ఓటర్లు పాత ఓటర్లతో సంబంధాన్ని లేదా కొత్త నమోదు ఆధారాలను చూపించాలని సూచించారు.ఒకవేళ ప్రస్తుత ఓటరు పేరు 2002 జాబితాలో లేకపోతే, వారి తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు, ఈపిక్ నంబర్ల వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ దశలో ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ఓటరు పేరు తొలగించబడితే మళ్లీ అప్పీల్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేయాల్సి వస్తుందని, అది సుదీర్ఘ ప్రక్రియ అవుతుందని తెలిపారు. జిల్లాలో లిఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని పేర్కొన్నారు.జూన్ మొదటి వారంలో మండల స్థాయిలో బీఎల్‌వోలు, బీఎల్ఏలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 15 నుంచి 24 వరకు ఎస్ఐఆర్‌లో పాల్గొనే బీఎల్‌వోలు, ఇతర సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్ల నుంచి నమోదు ఫారాలు స్వీకరిస్తారని తెలిపారు 2002 ఎస్ఐఆర్ జాబితాలో లేని ప్రతి ఒక్కరూ తిరిగి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇంటింటి సర్వే సమయంలో బీఎల్‌వోలకు బీఎల్ఏలు సహకరించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని, సరైన పత్రాలతో ఫారాలు నింపడంలో సహాయం చేయాలని సూచించారు. మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లు, రెండు చోట్ల ఓటు ఉన్న వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సరిగా కాకపోతే ఎన్నికల అధికారులు సంబంధిత వారికి నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. ఆ సమయంలో భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం పుట్టిన సంవత్సరాన్ని ఆధారంగా తీసుకుని అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారుజూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరి అయినా ఒకరి జనన లేదా గుర్తింపు పత్రం సమర్పించాలని తెలిపారు.డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బీఎల్‌వో ఎవరో ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇల్లు తాళం వేసి ఉంటే బీఎల్‌వోలు మూడు సార్లు సందర్శిస్తారని చెప్పారు. ఓటర్లు జశీవతీ.వవఅ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూరించవచ్చని తెలిపారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఫారం-6 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై జీలగ విత్తనాలు పంపిణీ



కోటగిరి తెలంగాణ పత్రిక మే 20.

కోటగిరి మండలంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50% సబ్సిడీపై జీలగ విత్తనాలను కోటగిరి ఏత్తొండ సహకార సంఘాలలో రైతులకు జీలగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ గ హనుమంతు ప్రారంభించారు. 30 కిలోల బస్తాకు 4905.00 రూపాయలు ఉండగా ,సబ్సిడీ 50శాతం పోను 2వేల 452.50 రూపాయలతో రైతులకు అందిస్తున్నామని అన్నారు. కోటగిరి ఎత్తొండ సహకార సంఘాలలో 200 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల పట్టా పాస్ బుక్ ఆధార్ కార్డు తీసుకుని విత్తనాలను కొనుగోలు చేయాలని వారు రైతులకు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి కోటగిరి సహకార సంఘ చైర్మన్ సిద్దు స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ అధికారులు ఏఈఓలు గౌస్ ఆస్మా కోటగిరి సహకార సంఘం కార్యదర్శి విట్టల్ సిబ్బంది నారాయణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి








-జూన్ 15 లోపు ఆసక్తి గల పౌరులు సభ్యులుగా చేరాలి

-టూరిజం గైడ్ పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి మే 20 ( తెలంగాణ పత్రిక )

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షఅన్నారు.బుధవారం జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ యాక్ట్ ద్వారా ఏర్పాటు చేయబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు,రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మార్గదర్శనంలో, రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ నాయకత్వంలో బహుముఖ సేవలందిస్తున్న అతి పెద్ద సంస్థ అని కలెక్టర్ పేర్కొన్నారు. మే15 నుండి జూన్ 15, 2026 వరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం, ఉచిత స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, క్యాన్సర్, సికిల్ సెల్, తలసేమియా రోగులకు ఉచిత రక్తాన్ని అందించడం, సీనియర్ సిటిజన్స్ హోమ్స్, అనాథ శరణాలయాలు, ఉచిత ప్రసూతి వైద్యశాలల నిర్వహణ వంటి ఎన్నో అద్భుతమైన సామాజిక సేవలు అందుతున్నాయని కలెక్టర్ వివరించారు.అనంతరం పెద్దపల్లి మండలం కొత్తపల్లికి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కనుకుంట్ల సదానందం కు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని జిల్లా కలెక్టర్ అందించారు.?18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఈ సంస్థలో సభ్యుడిగా చేరుటకు అర్హుడని, ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా జీవిత / వైస్ ప్యాట్రన్ / ప్యాట్రన్ సభ్యునిగా చేరవచ్చని సూచించారు. సభ్యత్వ నమోదు కొరకు పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఐడి ప్రూఫ్ నిమిత్తం ఆధార్ కార్డు / ఓటర్ ఐడి కార్డ్ / పాన్‌కార్డ్ అవసరమవుతాయని తెలిపారు. సభ్యులుగా చేరదలచిన వారు అధికారిక వెబ్సైట్ https://redcross.cgg.gov.in/ ద్వారా గానీ, లేదా గూగుల్ ప్లే స్టోర్ నుండి Telangana Red Cross మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని గానీ నమోదు చేసుకోవచ్చని, జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్లుగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ / డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ / ప్రాజెక్ట్ డైరెక్టర్ గ్రామీణ అభివృద్ధి అధికారిని నియమించామని, వారి కార్యాలయాల్లో ప్రత్యేకంగా డాటా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా అడిషనల్ కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రెగ్యులర్ గా సమీక్షిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో టూరిజం గైడ్ పోస్టర్ ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, ఉపాధి కల్పనాధికారి ,రాజశేఖర్, సహాయ కార్మిక అధికారి మహమ్మద్ రఫీ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కావేటి రాజగోపాల్, తదితరులు, పాల్గొన్నారు.

# ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు





-వడ్ల కొనుగోలు విషయంలో మాట్లాడే అర్హత బి.ఆర్.ఎస్ పార్టీ వారికి లేదు..

-రాష్ట్రంలోనే వరి కొనుగోళ్లో నాల్గవ స్థానంలో పెద్దపల్లి నియోజకవర్గం..

-అక్రమ దందాల గురించి మీకు తెలిసినంత మాకెవ్వరికి తెలియదు..

-మట్టి అమ్ముకునే చరిత్ర మీది..

-పార్టీలకు అతీతంగా పని చేస్తున్నాం..

-నియోజకవర్గంలో పారదర్శకంగా కొనుగోలు ప్రకియ జరుగుతుంది..

-గతంలో రైతన్నల నడ్డి విరిచింది మీరు కాదా..?

-తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసిన ఘనత మా ప్రభుత్వానిది..

- ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు.

పెద్దపల్లి, ప్రతినిధి మే 20 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు విలేకారుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు మాట్లాడుతూ.రైతన్నల విషయంలో ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా పార్టీలకు అతీతంగా పని చేస్తున్నామని పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోలు విషయంలో మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడటాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో రైతులకు సంబంధించిన కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతున్నాయని వివరించారు. నిన్న మంగళవారం రోజున మనోహర్ రెడ్డి మాటలను వింటుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉన్నాయని వారి మాటలు ప్రజలు నమ్మే ప్రసక్తి లేదని మా ప్రభుత్వంపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు వడ్ల కొనుగోలు విషయంలో మాట్లాడే అర్హత మనోహర్ రెడ్డి కి లేదని వారి హయంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలో క్వింటాలుకు పది నుండి పదిహేను కిలోల వరకు కోతలు విధించి రైతుల నడ్డి విరిచిన ఘనత వారిదే అని ఆ విషయం రైతులు కూడా ఎక్కడి వెళ్లినా చెబుతారని అన్నారు. రాష్ట్రంలోనే వరి కొనుగోళ్లో పెద్దపల్లి నాలుగోవ స్థానంలో ఉందని గుర్తు చేశారు. మనోహర్ రెడ్డి కి తెలిసినంత అక్రమ దందాల గురించి మాకెవ్వరికి తెలియదని వారి ప్రభుత్వ హయంలో ఇసుక మాఫియా మట్టి అక్రమ దందాలు చేసింది ఎవరో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు నని వారు అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సాగునీరందిచక అరిగోస పెట్టి అన్నదాతల ఆదాయానికి గండికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు టేలాండ్ ప్రాంతానికి కూడా సాగునీరు అందించి రైతన్న మొహంలో ఆనందం చూసామని రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంట విషయంలో కూడా ఎలాంటి కోతలు లేకుండా అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని గుర్తు చేశారు. మార్క్ ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మక్కలు కొనుగోలు చేస్తూ రైతులకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం సేకరించిన మక్కలకు మార్కెటింగ్ లేకున్నప్పటికీ నష్టాన్ని భరిస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ పాలనలో అప్పటి ప్రజాప్రతినిధులు కొనుగోళ్లలో పూర్తి స్థాయిలో రైతులకు అన్యాయం చేశారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మరియు బి.ఆర్.ఎస్ పార్టీ నేతలు వడ్ల కొనుగోలు విషయంలో మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని మనోహర్ రెడ్డి గారు శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు మట్టి అక్రమ దందాలు చేసి వారి విద్యాసంస్థల్లో నిలువ చేసుకున్న విషయం కూడా ప్రజలకు తెలుసని గతంలో పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ గోదాం రేకులు కూడా ఎత్తుకుపోయిన ఘనత మాజీ ఎమ్మెల్యే దే అని ఇలా చెప్పుకుంటూ పోతే మీ లీలలు ఇంతా అంత కావని ఎద్దేవ చేశారు. మీరు మరియు బి.ఆర్.ఎస్ పార్టీ వారికి కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదని కేటీఆర్ హరీష్ రావు ప్రమేయంతో ప్రజా ప్రభుత్వంపై లేని పోనీ ప్రెస్ మీటులు పెట్టీ విమర్శలు చేస్తామంటే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడక్కడ ఉన్న మీ తాబెదరులతో రైతులను మభ్యపెట్టి కొనుగోలు కేంద్రాల వద్ద గందరగోళాలు చేస్తామంటే సహించేది లేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీలకు వెంటనే వేతనాలు చెల్లించాలి

-- కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి: సీఐటీయూ



తెలంగాణ పత్రిక దమ్మపేట మే 20

దమ్మపేట:- అంగన్వాడి ఉద్యోగులకు ఏప్రిల్ నెల వేతనం వెంటనే చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. బుధవారం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిసి వసంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లు హెల్పర్లకు ఏప్రిల్ నెల వేతనం ఇంతవరకు రాలేదని వేసవిలో పెళ్లిళ్లు పెన్షన్లు ఎక్కువగా ఉంటాయని ఇలాంటి సందర్భాల్లో వేతనాలు రాకపోతే ఎంత ఇబ్బందిగా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలని అంగన్వాడి ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. కొత్తగా ఇచ్చిన సెల్ ఫోన్లు పనిచేయడం లేదని వీటిని వెంటనే వెనక్కి తీసుకుని అన్ని యాప్స్ సౌకర్యాలతో 5జి నెట్వర్క్ ఫోన్లు అందజేయాలని అన్నారు. ఐసిడిఎస్ వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమైన కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నూతన విద్యా విధానం చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని, అంగన్వాడి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సోయం సూరమ్మ నడిది కృష్ణవేణి జయ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి నివారణకు చర్యలు

-పంచాయతీ కార్యదర్శి అన్వర్ ఆలీ



ముధోల్: 19మే(తెలంగాణ పత్రిక)

తాగు నీటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముధోల్ పంచాయతీ కార్యదర్శి అన్వర్ ఆలీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాలనీలో తాగునీటి బోరు మోటార్లను పరిశీలించి చెడిపోయిన వాటికి మరమ్మత్తులను చేయించారు. వేసవి కాల దృశ్య తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులకు గురికా వద్దని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ ద్వార వచ్చే ట్రాక్టర్ లోనే చెత్త చెదారం వేయాలని కోరారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు.

44వ జాతీయ రహదారిపై రైతుల ధర్నా

## తహసిల్దార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రైతులు రాస్తారోకో నిర్వహించారు





వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 20 (తెలంగాణ పత్రిక):

మెదక్ జిల్లా మాసాయిపేట్ మండలం నాగసానిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ నాగసానిపల్లి గ్రామస్థులు, రైతులు బుధవారం 44 హైవేపై ధర్నా నిర్వహించారు. 20 రోజులుగా కేంద్రంలో కొనుగోళ్లు నిలిచిపోయాయని, తహశీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైవేపై తహశీల్దార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

# కూనారం పరిశోధన కేంద్రంలో మే 23 నుండి విత్తన వారోత్సవాలు

**-జిల్లా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. సతీష్ చంద్ర**

పెద్దపల్లి, ప్రతినిధి మే 20 ( తెలంగాణ పత్రిక )



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలో భాగంగా, కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈ నెల 23 నుండి 30 వరకు విత్తన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు కూనారం పరిశోధన కేంద్రం కే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. సతీష్ చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూనారం పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన అత్యుత్తమ రకం "కూనారం సన్నాలు కె.ఎన్.ఎమ్ 1638 పౌండేషన్ విత్తనం సుమారు 250 క్వింటాళ్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని,?10 కిలోల విత్తన సంచి ధర రూ. 750 గా ఉందని, ఈ రకం విత్తనం కొనుగోలు చేయడానికి ఆసక్తి కలిగిన రైతులు ఈ నెల 22వ తేదీ నుండి అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామని, ?పరిమిత పరిమాణంలో విత్తనాలు అందుబాటులో ఉన్నందున, ప్రాంతీయ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విత్తన బుకింగ్ ఇతర పూర్తి వివరాల కోసం 8333818202 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని డాక్టర్ బి. సతీష్ చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో

**-వ్యవసాయ శాఖ అధికారి కవిత**

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 20 (తెలంగాణ పత్రిక):



మాసాయిపేట మండలంలో సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో మాసాయిపేట మండల రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై జిలుగు (పచ్చి రొట్ట) విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. 30 కిలోల బస్తా ధర రూ.2452.50గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, సెల్ నెంబర్ జెరాక్స్ ప్రతులతో ఆన్‌లైన్ పర్మిట్ తీసుకుని స్థానిక అగ్రోస్ దుకాణంలో విత్తనాలను పొందవచ్చని సూచించారు. ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనం సరిపోతుందని, విత్తనం వేసిన 40 నుంచి 45 రోజుల తర్వాత నేలలో కలియదున్నాలని తెలిపారు. పచ్చి రొట్టె ఎరువుల వాడకం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం, భూసారం పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు సహజసిద్ధంగా నేలకు అందుతాయని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన మల్లన్నపల్లి సర్పంచ్

**-కలకొండ సరోజన -మధుకర్ రెడ్డి**

**-మాజీ సర్పంచ్ పోతుల నరసయ్య...**

వీణవంక ప్రతినిధి, మే 20 ( తెలంగాణ పత్రిక).



వీణవంక మండలం మల్లన్నపల్లి గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ కలకొండ సరోజన - మధుకర్ రెడ్డి, గ్రామస్తులకు, ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పాకెట్లను పంపిణీ చేశారు. మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ కు గ్రామస్తులు ఉపాధి హామీ కూలీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే రెడ్డిపల్లి గ్రామంలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మాజీ సర్పంచ్ పోతుల నరసయ్య హమాలి కూలీలకు, ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పాకెట్లను పంపిణీ చేశారు.నిత్యం ఏదో ఒక సమాజసేవ చేస్తూ వార్తల్లో నిలుస్తున్న రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య.రెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య బుధవారం ఉపాది హామీ కూలీలు హమాలీ కార్మికులకు 500 ల మజ్జిగ ప్యాకెట్లను తనతల్లితండ్రులైన పోతుల మోషయ్య-రాజమ్మ ల జ్ఞాపకార్థం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు మాజీ సర్పంచ్ వెంట రాగ ఉపాధి హామీ కూలీలు,హమాలీ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

# మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగానరేందర్ గౌడ్

పాపన్నపేట, మే 20:(తెలంగాణ పత్రిక)



ఈ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నరేందర్ గౌడ్ నియమితుల య్యారు. ఈ మేరకు టీపీసీసీ కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హన్మంత రావు,మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షులు హన్మంత్ గౌడ్ ల కు లింగంపేట నరేందర్ గౌడ్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పాపన్నపేట మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రోహిత్ రావు నేతృత్వంలో మండల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలాన్ని మరింత పెంచుతానని నరేందర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మేరకు టీపీసీసీ కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హన్మంత రావు, మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షులు హన్మంత్ గౌడ్ ల కు లింగంపేట నరేందర్ గౌడ్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పాపన్నపేట మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రోహిత్ రావు నేతృత్వంలో మండల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలాన్ని మరింత పెంచుతానని నరేందర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఆన్‌లైన్ ఫార్మసీలపై పోరు: మండలంలో 'మెడికల్ బంద్' సంపూర్ణం

**-కమలాపురం నుంచి రాజపేట వరకు భారీ బైక్ ర్యాలీ**

**-నకిలీ ప్రిస్క్రిప్షన్లు, ఆన్‌లైన్ దందాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

మంగపేట, మే 20 (తెలంగాణ పత్రిక):

ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపులో భాగంగా బుధవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన మందుల దుకాణాల బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. ఆన్‌లైన్ మందుల అమ్మకాలకు వ్యతిరేకంగా మండలంలోని మెడికల్ షాప్ నిర్వాహకులు, యజమానులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. బంద్‌కు మద్దతుగా కమలాపురం గ్రామం నుండి రాజపేట వరకు మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించి, ఆన్‌లైన్ ఫార్మసీల విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




**-ప్రజల ప్రాణాలతో చెలగాటం: అసోసియేషన్**

ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులు ఆన్‌లైన్ వేదికగా భారీ డిస్కౌంట్ల పేరుతో మాయాజాలం చేస్తున్నాయని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా, నకిలీ ప్రిస్క్రిప్షన్లను సృష్టిస్తూ కొత్త రకం దందాలకు తెరలేపారని ఆరోపించారు. అర్హత కలిగిన ఫార్మసిస్ట్‌ల పర్యవేక్షణ లేకుండా సాగుతున్న ఈ ఆన్‌లైన్ వ్యాపారాల వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**-అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి**

నిబంధనలు ఉల్లంఘిస్తూ సాగుతున్న ఆన్‌లైన్ మందుల అమ్మకాలను అరికట్టాలని, నకిలీ ప్రిస్క్రిప్షన్ల దందాపై డ్రగ్ కంట్రోల్ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక మందుల దుకాణాల నమ్ముకుని జీవిస్తున్న వేలాది కుటుంబాల ఉపాధిని కాపాడాలని కోరారు. ఈ నిరసన, బంద్ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బర్ల సంజీవరెడ్డి,సెక్రటరీ సామల సాంబశివరావు, కోశాధికారి వాలాద్రి శ్రీనివాసరెడ్డి, వీరితో పాటు మండల పరిధిలోని మెడికల్ షాప్ యజమానులు, నిర్వాహకులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోర్కల్ లో భారీగా సాగిన కార్డెన్ సర్చ్





**-నేరాల నియంత్రణ కోసమే కార్డెన్ సెర్చ్ లు..**

**-హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్..**

వీణవంక ప్రతినిధి, మే 20 ( తెలంగాణ పత్రిక).

సమాజంలో అసాంఘిక చర్యల నియంత్రణకే గ్రామాల్లో కార్డెన్సెర్చ్ నిర్వహించడం జరుగుతుందని హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ అన్నారు. మండలంలోని కోర్కళ్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున సీపీ గౌస్ ఆలాం ఆదేశాల మేరకు హుజూరాబాద్ టౌన్ సీఐ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 ద్విచక్ర వాహనాలు, 7 ఫోర్ వీల్, ఒక ఇసుక ట్రాక్టర్ను పట్టుకొని, సరైన ధృవపత్రాలు లేని వారికి జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరికీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్‌తో పాటు సరైన ధృవపత్రాలు ఉండాలని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచితులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వేసవికాలంలో దొంగతనాలకు ఆస్కారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్, వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి, శంకరపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి ,సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ- అనిల్, 50 మంది పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులగనన చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పై బీసీ సంఘాల హర్షం

**-చిరుమర్రి కృష్ణయ్య పిసిసి డెలిగేట్ మేంబర్**

మిర్యాలగూడ ప్రతినిధి//మే 20:(తెలంగాణ పత్రిక):-

దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పిసిసి డెలిగేట్ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య తెలిపారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యంగా బీసీలకు ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్ ను ఈరోజు సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం దీనికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వంలో అమలు చేసే నామినేటెడ్ పదవులు కూడా కులగరణ ఆధారంగా పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి సహకరించిన పెద్దలందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేసుకుంటూ బీసీల ఐక్యతకు ఈ యొక్క తీర్పు నిదర్శనమని, రాబోయే రోజుల్లో కూడా బీసీ లు అందరం ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని తెలిపారు.



# అనుమానాస్పద వ్యక్తులకు లాడ్జ్ గదులు ఇవ్వొద్దు, గుర్తింపు పత్రాలు తప్పనిసరి: టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

జగిత్యాల మే 20 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి



జగిత్యాల పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ మరియు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పట్టణ పోలీస్ స్టేషన్ పరిదిలోని లాడ్జ్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు తప్పనిసరిగా పాటించవలసిన భద్రత నిబంధనలు మరియు మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, లాడ్జ్‌లలో గదులు కేటాయించే ముందు ప్రతి ఒక్కరి నుండి ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. వారి పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి భద్రపరచాలని, అవసరమైన సందర్భాల్లో పోలీసులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా, లాడ్జ్ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్, పార్కింగ్ ప్రదేశాలు మరియు కారిడార్లలో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి 24 గంటల పాటు నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని తెలిపారు. సీసీ ఫుటేజ్ కనీసం కొంతకాలం భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులకు లేదా సరైన గుర్తింపు పత్రాలు లేని వారికి గదులు కేటాయించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం వలన నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉన్నందున లాడ్జ్ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన లాడ్జ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. పట్టణ భద్రతలో లాడ్జ్ నిర్వాహకుల సహకారం అత్యంత కీలకమని, ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# సంజీవ రెడ్డి పార్దివ దేహానికి నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యేలు

మిర్యాలగూడ ప్రతినిధి//మే 20:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామ మాజీ సర్పంచ్ మైనంపాటి సంజీవ రెడ్డి మృతి చెందాడు అని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు మరియు తిప్పన విజయసింహ రెడ్డి లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం గ్రామానికి చేరుకుని మైనంపాటి సంజీవ రెడ్డి పార్దివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంజీవ రెడ్డి గ్రామ అభివృద్ధికి, ప్రజా సేవకు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన మరణం గ్రామానికి, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. వారి వెంట చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఎం.డి. యూసుఫ్, మట్టపల్లి సైదులు యాదవ్, అంగోతు హాతిరాం నాయక్, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, ప్రసాద్, సోము సైది రెడ్డి, మద్దెల విక్టర్, హట్టి నాయక్, మహిమూద్, వేలిచేటి రామకృష్ణ, వేనేపల్లి పాండురంగా రావు, చౌగాని బిక్షం, మాలావత్ రవీందర్ నాయక్, మంచా నాయక్, ఎర్రబెల్లి పాపయ్య, ఎండీ మైమూద్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు.. క్రీడలు ముద్దు





-సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రావు

మే 20 ( తెలంగాణ పత్రిక )' ఓదెల

యువతే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ సరికొత్త కార్యచరణ డ్రగ్స్ వద్దు క్రీడలే ముద్దు అని సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు అన్నారు ఈ సందర్భంగా ఓదెల మండలంలోని కనపర్తి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో యువతకు సరికొత్త రూపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుల్తానాబాద్ సిఐ రంజి త్రవాదులయ్యారు ఈ సందర్భంగా రంజిత్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని మత్తుపదార్థాల రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి మరియు డీజీపీ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో సరికొత్త అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని నేటి యువత క్లిష్టమైన మత్తు పదార్థాల (డ్రగ్స్, గంజాయి) బారిన పడకుండా, యువత శారీరక, మానసిక శక్తిని క్రీడల వైపు మళ్లించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. అని అన్నారు. క్రీడా ప్రోత్సాహం: మత్తుకు బానిస అవ్వకుండా యువతకు ఆట స్థలాల ప్రాధాన్యతను పెంచడం జరుగుతుందని అన్నారు. "డ్రగ్స్ అనేవి యువత కెరీర్‌ను, యువత కుటుంబాల ఆనందాన్ని పూర్తిగా నాశనం చేస్తాయి. యువత తాత్కాలిక ఆనందాల కోసం జీవితాలను పాడుచేసుకోవద్దు. క్రీడలు క్రమశిక్షణను, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయి. స్పోర్ట్స్ కల్చర్‌ను అలవర్చుకోవడం ద్వారా డ్రగ్స్ మహమ్మారిని దూరం పెట్టవచ్చు" అని పిలుపునిచ్చారు.

**సమాజానికి మరియు తల్లిదండ్రులకు విజ్ఞప్తి:**

-తల్లిదండ్రులు తమ పిల్లల రోజువారీ స్నేహితులు, అలవాట్లపై నిరంతరం నిఘా ఉంచాలి.

-మీ పరిసరాల్లో డ్రగ్స్ విక్రయాలు లేదా గంజాయి రవాణాకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయవచ్చు. అన్నారు

**సమాచారం అందించాల్సిన నంబర్లు (రహస్యం ఉంచబడును):**

-టోల్ ఫ్రీ నంబర్: 1908, డయల్ 100, డయల్ 112.

-ఈగల్ ఫోర్స్ / TGANB కంట్రోల్ రూమ్: 8712671111

ఈ అవగాహన సదస్సులో పోత్కపల్లి ఎస్ ఐ దీకొండ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, పాల్గొన్నారు

# గత రాత్రి కురిసిన భారీ వర్షం,

## ఈదురు గాలులకు ఇంటి పైకప్పు ధ్వంసం



వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 20 (తెలంగాణ పత్రిక):


మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శంషారెడ్డిపల్లి తండాలో గత రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులు తీవ్ర నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు లక్ష్మణ్ ఇంటి పై కప్పు రేకులు గాలికి ఎగిరిపోవడంతో ఇల్లు పూర్తిగా దెబ్బతింది. దీంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు

# చల్లూరు పాఠశాల స్థలంలో ఉన్న 23 షాపులకు నోటీసులు జారీ

-గడువులోపు ఖాళీ చేయకుంటే చర్యలు తప్పవు..

-జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి..

వీణవంక ప్రతినిధి, మే 20( తెలంగాణ పత్రిక).



వీణవంక మండలం చల్లూరు గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి, కరీంనగర్- జమ్మికుంట ప్రధాన రహదారి వెంట షాపులు నడుపుతున్న 23 మంది వ్యక్తులకు జిల్లా పరిషత్ సీఈవో 15 రోజులలో ఖాళీ చేయాలంటూ , తేదీ 15.5.2026 రోజున నోటీసులు జారీ చేయడం జరిగింది. ఇట్టి విషయంపై గతంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముదిగంటి రఘునాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా, జిల్లా ఉన్నతాధికారులు ఎంక్వయిరీ చేయగా, 23 షాపులు పాఠశాల స్థలంలో నిర్మించి, ఏ శాఖ పర్మిషన్ లేకుండా, ఇంటి నంబర్ తో షాప్ లో నిర్వహించడం జరుగుతుందని రుజువుగా, ఈనెల 15న 23 షాపులు మూకుమ్మడిగా ఖాళీ చేయాలని, జిల్లా పరిషత్ సీఈఓ షాప్ యజమానులకు, సంబంధిత శాఖలకు నోటీసులు జారీ చేయడం జరిగింది. స్వచ్ఛందంగా 23 షాపులు15 రోజుల్లో ఖాళీ చేయకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా పరిషత్ సీఈవో షాపుల యజమానులను హెచ్చరించారు.

# మిర్యాలగూడ రైస్ మిల్లులలో ఆకస్మికంగా తనిఖీలు చేసిన ఆర్డిఓ రమణారెడ్డి



మిర్యాలగూడ ప్రతినిధి//మే 20:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ పట్టణంలో ఆర్డీవో రమణారెడ్డి బుధవారం రైస్ మిల్లులలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న దాన్యం బస్తాలను వేగవంతంగా దిగుమతి చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మిర్యాలగూడ మండలం వేములపల్లి మండలంలోని పలు రైస్ మిల్లులలో ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే దాన్యాలను వెంటనే దిగుమతి చేసుకోవాలని అన్నారు. రైతులను ధాన్యం కొనకుండా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన హెచ్చరించారు.

## ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో



తానూర్: 20మే ( తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన తానురు ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం జిల్లా జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై నిర్వహిస్తున్న కార్యక్రమాల పురోగతి, పేదలకు పొందుతున్న సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకున్నారు. హరితహారం లక్ష్యంగా నర్సరీలో మొక్కల పెంపకం రక్షణ, గ్రామాల్లో నిర్దేశించిన మొక్కలు నాటడం పై ముందస్తు చేపట్టాలని మండల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎం. వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ సునీల్, జూనియర్ అసిస్టెంట్ చతుర్వేది, మండల అధికారులు పాల్గొన్నారు.

## 50% శాతం సబ్సిడీ పై జీలుగ విత్తనాలుఅందుబాటులో

**-వ్యవసాయ అధికారి భాస్కర్**

20మే ( తెలంగాణ పత్రిక)ఓదెల



ఓదెల డీసీఎంఎస్ 1 2వ కేంద్రంలో 50% శాతం ప్రభుత్వ రాయితీ పై జీలుగ విత్తనాలు పంపిణీ కి అందుబాటులో ఉన్నాయి అని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓదెల మండల కేంద్రం లో నీ డీసీఎం ఎస్ 1 కేంద్రం తీర్థాల శ్రీనివాస్ టి సి ఎం ఎస్ 2వ కేంద్రం అకినపెల్లి రమేష్ షాపులలో జీలుగ విత్తనాలు అందుబాటు లో ఉన్నాయి అని తెలిపారు. 30 కిలోల సంచి కి రైతు ధర రూ. 2452.50/- అని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం , ఆధార్ కార్డు జిరాక్స్ ల తో సంబంధిత పై 2 డీసీ ఎం ఎస్ కేంద్రాల్లో సంప్రదించాలి అని తెలిపారు. రైతులకు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు

## పచ్చి రొట్ట విత్తనాలనురైతులకు పంపిణి చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి, ప్రతినిధి మే 20 ( తెలంగాణ పత్రిక )




పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని పచ్చి రొట్ట విత్తనాలను ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రారంబించి రైతులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు గ్రంధాలయ సంస్థ చైర్మన్,మున్సిపల్ చైర్మన్ మార్కెట్ చైర్మన్లు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు...

# నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలి







**-రోజుకు 20 లక్షల మంది కార్మికులతో పనులు నిర్వహణ**

**-ప్రతి గ్రామంలో కనీసం 20 పనులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలి**

**-మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వచ్చే 40 రోజుల్లో వినియోగించాలి**

**-లైవ్ అథెంటికేషన్ సర్వేతో కొత్త అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరుకు అవకాశం**

**-ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలి**


**-పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర అధికారుల అభినందనలు**

**-నరేగా పనుల, చేయూత పింఛన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన స్పెషల్ సీఎస్ పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్**

పెద్దపల్లి, ప్రతినిధి మే-20 ( తెలంగాణ పత్రిక )

నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సెర్ప్ సీఈఓ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వే పురోగతిని సమీక్షించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె అరుణ శ్రీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ మాట్లాడుతూ నరేగా కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, ప్రణాళికలో ఉన్న అన్ని పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. నరేగా పథకం జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు నరేగా పనుల్లో పాల్గొంటుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల కోసం ముందురోజే కార్మికుల సమీకరణ చేపట్టాలని, పనులు గ్రామ హాబిటేషన్ పరిధిలోనే ఉండేలా చూడాలని, ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి, ప్రధాన పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే 40 రోజుల పాటు ఎంపీడీవోలు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి సారించి పనులను వేగవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అసైన్డ్ భూముల్లో కూడా ఫామ్‌పాండ్‌ల నిర్మాణ పనులను చేపట్టి రైతులకు ఉపయోగకరంగా మలచాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం వేళల్లో జిల్లా కలెక్టర్లు స్వయంగా ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ముఖ్యమంత్రి సుమారు 8 వేల వీవో భవనాలకు శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో రాబోయే 40 రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భవన పనులను బుక్ చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, మహిళా సంఘాల భవనాలు వంటి నిర్మాణాలను నరేగా కింద ప్రణాళిక చేయవచ్చని తెలిపారు. గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌ల శుభ్రత పనులను నిరంతరంగా చేపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ. 408.79 కోట్లకు పరిపాలనా అనుమతులు లభించగా, ఇప్పటివరకు రూ. 65.20 కోట్ల మేర మాత్రమే క్లెయిమ్ చేయబడిందని, ఇంకా రూ. 343.59 కోట్ల బ్యాలెన్స్ నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే 40 రోజుల్లో ఈ నిధులను ప్రాధాన్యతగా బుక్ చేసి పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాకు సగటున రూ. 30 కోట్లకు పైగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించాలన్నారు. గత ఏడాది నీటి సంరక్షణ పనుల్లో పలువురు కలెక్టర్లు కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ ఏడాది మరింత ఎక్కువ పనులు జరుగుతున్నప్పటికీ పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయకపోవడంతో రాష్ట్రం ప్రస్తుతం 10వ స్థానంలో ఉందన్నారు. మనం చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్ పనుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పనితీరు తక్కువగా ఉన్న మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని, నరేగా పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పనులను గుర్తించాలని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ వెంటనే కొత్త జాబ్ కార్డులు జారీ చేయాలని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 41 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, అందులో పోస్టల్ శాఖ ద్వారా 21 లక్షల మందికి నగదు రూపంలో పెన్షన్ పంపిణీ జరుగుతోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మరో 20 లక్షల మంది లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్ జమ అవుతోందన్నారుఫేస్ రికగ్నిషన్ విధానం అమలుతో మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన లబ్ధిదారుల కారణంగా ఇప్పటికే సుమారు 20 వేల పెన్షన్లు తగ్గినట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరికీ లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో నిర్వహించిన పైలట్ సర్వేలో సుమారు 9 శాతం మంది లబ్ధిదారులు మరణించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. లైవ్ అథెంటికేషన్ సర్వే పూర్తయ్యే సమయానికి కనీసం 5 శాతం మరణించిన లబ్ధిదారుల కేసులు గుర్తించినా మరో లక్ష మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.నగదు రూపంలో పెన్షన్ పంపిణీని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. పెద్దపల్లి, జగిత్యాల, కొత్తగూడెం, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో ఇంకా సుమారు 2 వేల పోస్టల్ పంపిణీలు మాత్రమే ఉన్నాయని, వాటిని కూడా బ్యాంకింగ్ విధానానికి మార్చేందుకు చర్యలు



తీసుకోవాలని సూచించారు. దివ్యాంగుల సదరం కేంద్రాల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించాలితెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా సదరం కేంద్రాలు ఏర్పాటు చేసి దివ్యాంగుల అంచనా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో సదరం కేంద్రాల్లో అవసరమైన సౌండ్ ప్రూఫ్ పరికరాలు, ఇతర ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 80 నుంచి 100 శాతం తీవ్ర దివ్యాంగత కలిగిన సుమారు 23 వేల మంది ఉన్నారని, కొత్త పింఛన్ల మంజూరులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలి . నిర్మల్ జిల్లాలో ఎన్‌పీఏలను పూర్తిగా సున్నాకి తగ్గించడం అభినందనీయమని పేర్కొన్నారు. జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు కూడా త్వరలోనే ఎన్‌పీఏలను జీరో స్థాయికి తీసుకురానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్త్రీనిధి రుణాల చెల్లింపులు, ఎన్‌పీఏల నియంత్రణపై ప్రతి నెల జిల్లా కలెక్టర్లు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. పెద్దపల్లి జిల్లాలో ఎన్‌పీఏలను దాదాపు సున్నాకి తీసుకురావడంపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు రాష్ట్ర అధికారుల అభినందనలుపెద్దపల్లి జిల్లాలో ఎన్‌పీఏలను దాదాపు సున్నా స్థాయికి తీసుకురావడంలో సమర్థవంతమైన చర్యలు చేపట్టిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను రాష్ట్ర స్థాయి అధికారులు అభినందించారు. స్త్రీనిధి రుణాల వసూళ్లు, రికవరీ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణతో జిల్లాలో గణనీయమైన పురోగతి సాధించారని పేర్కొన్నారు. ఇతర జిల్లాలు కూడా పెద్దపల్లి జిల్లాను ఆదర్శంగా తీసుకొని ఎన్‌పీఏల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలుకు సంబంధించి కొత్త జీవో విడుదలైందని, ఈ పథకం అమలు బాధ్యత గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం అమలుకు ఎంపీడీవోలే అధికారులని పేర్కొన్నారు. కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేద కుటుంబాలకు ఈ పథకం కింద రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. ఇతర బీమా పథకాల ప్రయోజనం లేని ప్రతి అర్హ కుటుంబానికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కొత్త పెన్షన్లు మంజూరు చేయాలంటూ మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తుందని తెలిపారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పెండింగ్ దరఖాస్తుల ప్రాధాన్యత క్రమాన్ని ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్డిఓ కాళిందిని, మునిసిపల్ కమీషనర్లు, వెంకటేష్, మనోహర్ ఎంపీడీఓలు, ఏపీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాలో వేగంగా మొక్కజొన్న కొనుగోలు

**-జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10,089 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి**

**-ఈరోజు ఒక్కరోజే సుమారు 1,600 మెట్రిక్ టన్నుల పంట సేకరణ**

**-రవాణా కోసం 110 వాహనాలు, 91 ట్రాక్టర్లు, 19 లారీలు, డీసీఎంలు**

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి, ప్రతినిధి మే 20 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోళ్లు అత్యంత పారదర్శకంగా, వేగంగా సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షబుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.?మే 20, 2026 నాటికి జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్ల తాజా పరిస్థితిని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 23,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను సేకరించాలని అంచనా వేయగా, ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 10,089 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లు విజయవంతంగా పూర్తయ్యాయని, కేవలం ఈరోజు ఒక్కరోజే సుమారు 1,600 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగిందని ఆయన వివరించారు.?మొత్తం అంచనా వేసిన మొక్కజొన్న కొనుగోలు: 23,000 మెట్రిక్ టన్నులు, ?ఇప్పటివరకు కొనుగోలు చేసిన మొక్కజొన్న: 10,089 మెట్రిక్ టన్నులు, ?ఈరోజు జరిగిన కొనుగోలు సుమారుగా 1,600 మెట్రిక్ టన్నులు, ?జిల్లాలో అందుబాటులో ఉన్న మొత్తం నిల్వ సామర్థ్యం 23,000 మెట్రిక్ టన్నులు?రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని నిల్వ ఉంచేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ నిల్వ కేంద్రాలు గోడౌన్ మార్కెట్ కమిటీలలో ఏ ఎం సీ తగిన సామర్థ్యం అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి ఏఎంసీ, ఓదెల, పోత్కపల్లి, శ్రీరాంపూర్, కూనారం తదితర 9 కొనుగోలు కేంద్రాల పరిధిలో రవాణా వ్యవస్థను మరింత వేగవంతం చేస్తున్నామని, ?కొనుగోలు కేంద్రాల నుండి గోదాములకు మొక్కజొన్నను తరలించేందుకు ఈరోజు జిల్లా వ్యాప్తంగా మొత్తం 91 ట్రాక్టర్లు, 19 లారీలు/డీసీఎంలు (మొత్తం 110 రవాణా వాహనాలు) నిరంతరం సేవలందిస్తున్నాయని తెలిపారు.?రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు, నీడ సదుపాయాలు కల్పించాలని, రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# సిలిండర్ సరఫరాలో జాప్యంపై వినియోగదారుల ఆందోళన

**-అధికారుల జోక్యం కోరుతున్న ఆళ్లపల్లి ప్రజలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 16 ( తెలంగాణ పత్రిక ప్రతినిధి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ సరఫరాలో జాప్యం జరుగుతోందని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా పనిచేస్తున్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుకింగ్ చేసినప్పటికీ సకాలంలో సిలిండర్లు అందడం లేదని బాధితులు చెబుతున్నారు. వినియోగదారుల కథనం ప్రకారం, బుకింగ్ చేసిన తర్వాత కూడా వారాల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, ఫోన్ ద్వారా సంప్రదించినా సరైన స్పందన లభించడం లేదని తెలిపారు. కార్యాలయానికి వెళ్లినా స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దినసరి కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. రేగళ్ల, అజీరాం గొప్పకు చెందిన కొందరు వినియోగదారులు మాట్లాడుతూ, “రెండు నెలలుగా గ్యాస్ సిలిండర్ కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ ఇంకా అందలేదు” అని తెలిపారు. మరోవైపు ఇతర ఏజెన్సీలకు కనెక్షన్ మార్చుకోవాలనుకున్న వారికి అవసరమైన ధృవపత్రాలు, ఎన్‌ఓసీలు సమయానికి ఇవ్వడం లేదని కూడా కొందరు ఆరోపించారు. గ్యాస్ ధరలు పెరిగాయని చెబుతూ అదనపు భారం పడుతోందని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సరఫరాపై ఆధారపడే టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు, చిన్న హోటళ్ల యజమానులు కూడా వ్యాపార నష్టాలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే వినియోగదారుల ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.




# నేడు భావితరాలకు అమ్మ కొంగు ప్రేమ మాధుర్యం దొరకునా







**-అమ్మ చీర కొంగు గొప్పతనం తెలుసుకో.**

**- జీన్స్‌లో అమ్మ “కొంగు” ఎక్కడ దొరుకుతుంది?**

తెలంగాణ పత్రిక ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గంమే 20.

అమ్మ కొంగు కేవలం ఒక వస్త్రపు ముక్క మాత్రమే కాదు; అది అమ్మ యొక్క గౌరవం మరియు ఔన్నత్యం. పొయ్యి మీద ఉన్న వేడి పాత్రలను దించడానికి అమ్మ కొంగునే ఉపయోగించేవారు. అది పిల్లల చెమటను, కన్నీళ్లను తుడిచేది; మురికి పట్టిన ముఖాలను, చెవులను, చిట్టి చేతులను శుభ్రం చేసేది. భోజనం చేసిన తర్వాత, అమ్మ కొంగుతో మా ముఖాలను తుడిపించుకోవడంలో ఒక ప్రత్యేకమైన హాయి ఉండేది. మా కళ్ళలో ఏదైనా పడినప్పుడు, అమ్మ కొంగును మెలివేసి, తన ఊపిరితో దాన్ని మెల్లగా వెచ్చబరిచి, కంటిపై ఉంచేది ఎందుకో తెలియదు గానీ, ఆ నొప్పి వెంటనే మాయమైపోయేది. అమ్మ ఒడిలో నిద్రించే పిల్లలకు, ఆమె ఒడి మృదువైన పడకగా, ఆమె కొంగు హాయినిచ్చే దుప్పటిగా మారేది. ఇంట్లోకి ఎవరైనా కొత్తవారు వచ్చినప్పుడు, పిల్లలు భద్రత కోసం అమ్మ కొంగు వెనుక దాక్కునేవారు. పిల్లలకు సిగ్గు అనిపించినప్పుడు, వారు అమ్మ కొంగుతో తమ ముఖాన్ని కప్పుకునేవారు. పిల్లలు బయటకు వెళ్ళినప్పుడు, వారు అమ్మ కొంగును పట్టుకునేవారు; అది వారికి మార్గదర్శిగా, రక్షణ కవచంగా నిలిచేది. పిల్లలు అమ్మ కొంగును పట్టుకుని ఉన్నంత సేపు, ఈ ప్రపంచమంతా తమ చేతిలోనే సురక్షితంగా ఉన్నట్లు వారికి అనిపించేది.

చలికాలంలో, చలి నుండి రక్షించడానికి అమ్మ తన కొంగుతో పిల్లలను నలువైపులా చుట్టేసేది. మరియు భారీ వర్షం కురిసినప్పుడు, అదే కొంగు గొడుగులా మారి పిల్లల ముఖాన్ని కప్పేది. చేతులు తుడుచుకోవడానికి అమ్మ కొంగును తువ్వాలులా కూడా ఉపయోగించేవారు. చెట్ల కింద రాలిన పూలను, పండ్లను సేకరించి అందులోనే మోసుకొచ్చేది. కొన్నిసార్లు, ధాన్యాన్ని, నైవేద్యాన్ని లేదా ప్రసాదాన్ని అందులోనే సేకరించేవారు. ఇంటి సామాన్లను దుమ్ము దులపడానికి, శుభ్రం చేయడానికి కూడా దాన్ని ఉపయోగించేవారు. ఏదైనా వస్తువు పోయినప్పుడు, అది త్వరలోనే దొరుకుతుందని నమ్మి అమ్మ తన కొంగుకు ఒక ముడి వేసేది వింతగా అనిపించినా, అది సాధారణంగా దొరికిపోయేదే. అమ్మ కొంగులోని ఆ ముడి ఒక కదిలే బ్యాంకు లేదా లాకర్ లాంటిది; పిల్లల అదృష్టం బాగుంటే, అందులో దాగి ఉన్న కొన్ని నాణేలు మాయాజాలంలా బయటపడేవి కూడా. అమ్మ చీర కొంగు కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు అది ఒక అద్భుతమైన అనుభూతి, ఒక భావోద్వేగం, ఒక ఆశ్రయం, మరియు ప్రేమతో నిండిన ఒక ప్రపంచం., నేటి తరం ఆ కొంగులోని వెచ్చదనాన్ని, దాని లోతైన అర్థాన్ని బహుశా ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేకపోవచ్చు. ఇప్పుడు, అమ్మలు జీన్స్ ధరిస్తున్న ఈ రోజుల్లో.. మరి ఆ “కొంగు” ఎక్కడి నుండి వస్తుంది? ప్రేమను, వెచ్చదనాన్ని, త్యాగాన్ని మరియు బాల్యపు లెక్కలేనన్ని మధుర స్మృతులను తనలో మోసుకున్న ప్రతి అమ్మ చీర కొంగుకు ఈ నివాళి.

# ఈ-ఫార్మసీలకు వ్యతిరేకంగా మెడికల్ షాపుల బంద్

**-జిల్లావ్యాప్తంగా 24 గంటల పాటు మూతపడ్డ ఔషధ దుకాణాలు**

కొత్తగూడెం ఆర్ సి, మే 20 :



ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా ఔషధ దుకాణాల యజమానులు 24 గంటల బంద్ నిర్వహించారు. ఔషధ వ్యాపారుల సంఘాల పిలుపు మేరకు చేపట్టిన ఈ బంద్‌లో కొత్తగూడెం పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక ఔషధ దుకాణాలు స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. కొత్తగూడెం పట్టణంలోని గణేష్ ఆలయ ప్రాంతంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆన్‌లైన్ మందుల విక్రయాలు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని, నకిలీ మందుల సరఫరాకు అవకాశం పెరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ విక్రయాలు, ఇంటికే మందుల పంపిణీకి సంబంధించిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న వ్యాపారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని, కార్పొరేట్ సంస్థలకు మాత్రమే ప్రయోజనం చేకూరే విధంగా విధానాలు అమలవుతున్నాయని సంఘ నాయకులు విమర్శించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్ మందుల విక్రయాలను నిలిపివేయాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ బంద్‌కు పలు వ్యాపార, కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

దమ్మపేట మే 20(తెలంగాణ పత్రిక)



దమ్మపేట మండల కేంద్రంలో ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పేద ప్రజలకు అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు,అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు తమ అభిమాన హీరో ఇంక మరెన్నో విజయాలు సాధించి భవిష్యత్ లో ప్రజా సేవలో రావాలని వారు తెలియచేశారు ఈ కార్యక్రమంలో అభిమానులు ఎండి వలీపాషా,సాయిల నర్సి,షేక్ గోరె, ఉయ్యాల లక్ష్మినారాయణ, సయ్యద్ మౌలానా,పానుగంటి భార్గవ్,పిట్టల లాలూ,వేణు, ఉలవల.సాయి,సతీష్,రాజు,తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని ప్రోత్సహించాలి



మిర్యాలగూడ ప్రతినిధి//మే 20:(తెలంగాణ పత్రిక):-

తొలి,మలి దశ ఉద్యమంతోనే తెలంగాణ సాధన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ తీరు మలి దశ ఉద్యమంలో జరిగిన కార్యక్రమాలపై బుధవారం మిర్యాలగూడలోనీ ఎన్ఎస్పి క్యాంప్ ఇందిరా క్యాంటీన్ వద్ద జరిగింది. ఉద్యమకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని సీనియర్ జర్నలిస్టు ఖాజా హామీదుద్దీన్ బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు, తొలి దశ తెలంగాణ ఉద్యమ సంఘం అధ్యక్షులు లింగయ్య లు అన్నారు. రాష్ట్ర ఏర్పాటు రోజైనా ఉద్యమకారులను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకార్లను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన వారికి మొదటి ప్రాధాన్యత జైలు పాలైన వారికి రెండో ప్రాధాన్యత ఇచ్చి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు,ఆర్టీసీ నాయకులు ఇక్బాల్,కిషోర్, డైమండ్ చిన్న, గంధం సైదులు, సత్యనారాయణ, వేముల లింగయ్య, వరగాని కృష్ణమూర్తి , తడకమళ్ళ విజయకుమార్, మన్నెం లక్ష్మయ్య , కుక్కడపు మల్లయ్య, చిట్టిపోలు లింగయ్య, జయరాజు, రాపోలు పరమేష్, ఈశ్వరా చారి, తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో కులగణనకు సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం బీసీల విజయం

-కుల గణన వ్యతిరేకులకు ఇది చెంపపెట్టులి

-బీసీల జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా దక్కాల్సిందే.

-బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ ప్రతినిధి//మే 20:(తెలంగాణ పత్రిక):-



జనగణనలో కులాల లెక్కింపుకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొంతమంది కులగణన వ్యతిరేకులు జన గణనలో కులాల లెక్కింపు అవసరం వద్దని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని కానీ ఈరోజు సుప్రీంకోర్టు న్యాయమైన తీర్పు ఇచ్చిందని సంక్షేమ పథకాల అమలుతో పాటు ఎవరి జనాభా ఎంత ఉందో తెలిస్తేనే వారి జనాభా దామాషా ప్రకారం వారికి నిధులు కేటాయించ బడతాయని వాటితోటే బీసీల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. బీసీల జనాభా దామాషా ప్రకారం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని మేమెంతో మాకు అంత వాటా దక్కాల్సిందేనని లింగం గౌడ్ పేర్కొన్నారు.

# కొనుగోలు, రవాణా లో మరింత వేగం

## పెరగాలి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



తెలంగాణ పత్రిక ప్రతినిధి 20 మే లింగాల ఘణపురం.

బుధవారం లింగాల ఘనపూర్ మండలం జీడికల్ గ్రామం లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికం గా సందర్శించి... కొనుగోలు ప్రక్రియ ని పరిశీలించారు. ఈ సందర్భంగా... ఇప్పటి వరకు కేంద్రం లో జరిగిన కొనుగోలు వివరాలు, రిజిస్టర్ నిర్వహణ, ట్యాబ్ ఎంట్రీ, లోడింగ్, అన్ లోడింగ్ ఎలా అవుతుందని కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం కేంద్ర నిర్వాహకులకు పలు ఆదేశాలు, సూచనలను ఇచ్చారు. ప్రతీ బస్తా 41 కేజీ లు మాత్రమే ఉండాలని... ఎక్కువ తూకం వేయకూడదని...కాంట ప్రక్రియ త్వరగా కావాలని, సరిపడా హమాలీ లను పెట్టుకొని కొనుగోలు అయిన ధాన్యం త్వరగా మిల్ లకు తరలించాలన్నారు ట్రక్ తో... కేంద్రానికి సంబందించిన ఎవరో ఒకరు తప్పకుండ వెళ్లి అన్ లోడింగ్ త్వరగా అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు . ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు చేస్తే....రైతుల ఖాతా లో నగదు జమ ఆలస్యం కాదన్నారు.

# పర్యాటక ప్రాంతాల, చారిత్రాత్మక కట్టడాల ప్రాధాన్యత భావితరాలకు అందించాలి

-జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తెలంగాణ పత్రిక ప్రతినిధి 20 మే లింగాల ఘణపురం.




99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల నేపథ్యంలో..బుధవారం హెరిటేజ్ వాక్ లో భాగం గా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లింగాల ఘణపురం మండలం జీడికల్ గ్రామ చౌరస్తా నుండి శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయం వరకు హెరిటేజ్ వాక్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సుసంపన్నమైన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వాన్ని భావి తరాలకు తెలియజేయాలన్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాల ఉనికి భావితరాలకు అందించాలని,జిల్లాలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలను యువత, పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఆనంతరం... శ్రీరాముడి వీరత్వానికి ప్రతీతిగా... రెండో భద్రాద్రిగా పేరొందిన ఈ దేవాలయానికి కలెక్టర్ దర్శనానికి వెళ్లగా. ఆలయ పూజారులు వేద మంత్రాలతో కలెక్టర్ కి స్వాగతం పలికారు . స్వామి వారి దివ్య దర్శనం అనంతరం... పూజారులు కలెక్టర్ కి వేద ఆశీర్వచనం ఇచ్చారు . చివర గా టూరిజం గైడ్ కి సంబందించిన పోస్టర్ ని కలెక్టర్, అధికారులు, ఆలయ చైర్మన్,ఏలే నర్సింహులు (మూర్తి) పూజారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో.. టూరిజం అధికారి నర్సింహా రావు,ఎంపీడీఓ, జి సి డి ఓ, సర్పంచ్,ఆలయ ఆలయ చైర్మన్, ఈఓ, గ్రామస్తులు, ఖూా కళాకారులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు అంతా సిద్ధమైంది

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం ప్రస్తుతం ప్రయాగ్ రాజ్ ను తలపిస్తుంది.. ఈరోజు ఉదయం 5.43 నిమిషాలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ తొలి స్నానం ఆచరించిన అనంతరం అంత్య పుష్కరాలు ఆరంభమవుతాయి.. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తొలిరోజు పుష్కర స్నానం ఆచరిస్తారు.. 12 రోజుల పాటు జరిగే అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సరస్వతి అంత్య పుష్కరాలకు అంతా సిద్ధమైంది.. కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం ప్రస్తుతం ప్రయాగ్ రాజ్ ను తలపిస్తుంది ఈరోజు ఉదయం 5.43 నిమిషాలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ తొలి స్నానం ఆచరించిన అనంతరం అంత్య పుష్కరాలు ఆరంభమవుతాయి.. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తొలిరోజు పుష్కర స్నానం ఆచరిస్తారు.. 12 రోజుల పాటు జరిగే అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సరస్వతి అంత్య పుష్కరాలకు సమయం సమయం ఆసన్నమైంది.. మే నెల 21 నుండి జూన్ 01 వరకు 12 రోజుల పాటు జరుగనున్న అంత్య పుష్కరాలకు అదిరిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నారు.. ప్రస్తుతం కాళేశ్వరం త్రివేణి సంగమం సరస్వతి పుష్కరాల శోభతో కొత్త రూపుదిద్దుతుంది.. ప్రయాగరాజును తలపిస్తుంది. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది సరస్వతి పుష్కరాలు జరిగాయి.. తాజాగా అంత్య పుష్కరాలకు కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 నుండి సరస్వతి నది అంత్య పుష్కరాలు నిర్వహిస్తున్నారు.. అంత్య పుష్కరాల సందర్భంగా జ్ఞానసరస్వతి పుష్కర ఘాట్,



VIP ఘాట్ వద్ద ప్రత్యేక సెట్టింగ్స్ చేశారు.. సౌండ్స్ అండ్ లైటింగ్, ప్రత్యేక డెకరేషన్ చేస్తున్నారు.. VIP భక్తుల కోసం 40 ఆధునిక గుడారాలతో టెంట్ సిటీ నిర్మించారు.. 21వ తేదీ ఉదయం 5.43 నిమిషాలకు పుష్కరాలు ఆరంభమవుతాయి.. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ తొలి స్నానం ఆచరిస్తారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తొలిరోజు పుష్కర స్నానం ఆచరిస్తారు.. గవర్నర్ పర్యటన సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.. అంత్య పుష్కరాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు వస్తుండడంతో కొన్ని శాశ్వత నిర్మాణాలు చేస్తున్న అదికార యంత్రాంగం.. నవరత్న హారతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.. అంత్య పుష్కరాలు జరిగే 12 రోజులు వివిధ ప్రాంతాల నుండి స్వామిజీలు, పీఠాదిపతులు రానున్నారు.. ప్రత్యేక హోమాలు ఉంటాయి.. మొదటిరోజు 21వ తేదీ గురువారం రోజున మహా గణపతి హోమం ఉంటుంది..22వ తేదీన సుబ్రహ్మణ్య షాడాక్షరీ హోమం, 23వ తేదీన హయగ్రీవ హోమం, 24వ తేదీన నవగ్రహ హోమం, 25వ తేదీన మహా మృత్యుజయ హోమం, 26వ తేదీన దుర్గా సూక్త హోమం, 27వ తేదీన మహా సుదర్శన హోమం, 28వేద దక్షిణామూర్తి హోమం, 29వ తేదీన స్వయంవర పార్వతి హోమం, 30వ తేదీన ధన్వంతరి హోమం, 31వ మహారుద్ర హోమం, 01వ తేదీన లఘు చండీ మహా పూర్ణాహుతి ఉంటుంది.. సరస్వతి అంత్య పుష్కరాలకు తెలంగాణ ాజ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డిపోల నుండి 3,360 బస్సు సర్వీసులు నడుపుతుంది. 2500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# 'రమణి కళ్యాణం' ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా.. ట్రైలర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని

తెలంగాణ పత్రిక ప్రతినిధి 20 మే

సూర్య వశిష్ట, దీప్షిక హీరో హీరోయిన్లుగా దర్శకుడు విజయ్ ఆదిరెడ్డి తెరకెక్కిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా 'రమణి కళ్యాణం' చిత్ర ట్రైలర్ మరియు ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లోని ప్రసాద్ లాబ్స్‌లో నిన్న రాత్రి ఘనంగా నిర్వహించారు. క్రెట్స్ క్రియేటివ్స్ బ్యానర్‌పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి, శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సినీ నటుడు ఆలీ, యువ నాయకుడు విష్ణురెడ్డి హాజరై చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ట్రైలర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగ కథాంశంతో రూపొందిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. కొత్త కథలు, కొత్త ప్రతిభను ప్రేక్షకులు ఎప్పుడూ ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు. సినీ నటుడు ఆలీ మాట్లాడుతూ, చిత్ర బృందం చేసిన కృషి ట్రైలర్‌లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. దర్శకుడు విజయ్ ఆదిరెడ్డి మాట్లాడుతూ, కుటుంబ విలువలు మరియు భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ చిత్రాన్ని తెరకెక్కించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర




యూనిట్ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

# పెరిగిన ఇంధన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం.. మోదీ దిష్టిబొమ్మ దగ్ధం

తెలంగాణ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 20 మే

హనుమకొండలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుకు నిరసనగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు మోదీ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తైన వెంటనే ఇంధన ధరలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో ధరలు పెరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు సామాన్య ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నారని ఆరోపించారు. పెరిగిన ఇంధన ధరల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి మధ్యతరగతి, పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల నుంచి ఆటో డ్రైవర్ల వరకు ప్రతి వర్గం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. "అచ్చే దిన్" అంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకు "భారాల దిన్" చూపిస్తోందని ఎద్దేవా చేశారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అజీజ్ ఖాన్, తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల




శ్రీమాన్, మాధవి, బంక సరళ, నాయిని లక్ష్మారెడ్డి, బంక సంపత్, తౌటం రవీందర్, అలువాల కార్తీక్, తోట పవన్, గుంటి స్వప్నతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుర్గమ్మ పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

తెలంగాణ పత్రిక మే 20 జనగామ

రఘునాథపల్లి మండలం మండలగూడెం గ్రామంలో నిర్వహించిన దుర్గమ్మ పండుగకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీర్వాదాలు మండలగూడెం గ్రామ ప్రజలందరిపై నిండుగా ఉండాలని, మంచి మనసుతో కొలిస్తే ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. దుర్గమ్మ దీవెనలతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, స్థానిక



సర్పంచ్ రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# బిజినెస్

## హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్




ప్రైవేటు బ్యాంకు దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ తన ఉద్యోగులకు రెండు రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ప్రవేశపెట్టింది. అంతర్జాతీయ ముడి చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పాటించాలని, కార్పొరేట్ సంస్థలు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఇటీవల పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ ఆ మేరకు నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. కస్టమర్లతో నేరుగా సంబంధం లేని వ్యాపార, కార్పొరేట్ బ్యాంకింగ్‌లకు సంబంధించిన ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తున్నట్లు తెలిపింది. తక్షణమే ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది. అయితే దీనిని నెలరోజుల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని,ఆ తర్వాత పనితీరును బట్టి కొనసాగించాలా లేదా అనే నిర్ణయం ఉంటుందని తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీలోని ట్రెజరీ ఆపరేషన్స్,బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, హెచ్‌ఆర్ డిపార్టుమెంట్, ఫైనాన్స్ అకౌంట్స్ వంటి అంతర్గత విభాగాల ఉద్యోగులకు మాత్రమే ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ వర్తిస్తుంది. కస్టమర్లతో నేరుగా సంబంధం ఉండే ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వర్తించదు. ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల వినియోగదారులకు బ్యాంకు సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండదని బ్యాంకు స్పష్టం చేసింది.

## మోదీ 'మెలోడీ' గిఫ్ట్.. కన్‌ఫ్యూజ్ అయిన ఇన్వెస్టర్లు!




- మెలొడీ చాక్లెట్ వీడియోతో పెరిగిన పార్లే ఇండస్ట్రీస్ షేర్లు
- ఐదు శాతం పెరిగిన షేరు విలువ
- మెలొడీ చాక్లెట్‌కు పార్లే ఇండస్ట్రీస్‌కు సంబంధం లేదు
- చాక్లెట్లు తయారు చేసే పార్లే ప్రొడక్ట్స్ స్టాక్ మార్కెట్లో లేదు
- పేరు కన్ఫ్యూజన్‌తో మోసపోయిన ఇన్వెస్టర్లు

ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీ ప్రధాని మెలోనికి 'పార్లే మెలొడీ' చాక్లెట్ గిఫ్ట్ ఇచ్చిన వీడియో సోషల్ మీడియాను ఎంతగా ఊపేస్తుందో తెలిసిందే. అయితే ఈ వైరల్ వీడియో స్టాక్ మార్కెట్‌లో ఊహించని అలజడి సృష్టించింది. ఒకేలా ఉన్న పేరును చూసి ఇన్వెస్టర్లు తొందరపడి తప్పుడు కంపెనీ షేర్లను కొనేశారు.

**షేర్ మార్కెట్లో మెలొడీ మాయ**

మోదీ చాక్లెట్ ప్యాకెట్ ఇచ్చిన వీడియో బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే దలాల్ స్ట్రీట్‌లో హల్‌చల్ మొదలైంది. 'పార్లే ఇండస్ట్రీస్' అనే కంపెనీ షేర్లు ఇంట్రాడేలో దాదాపు 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. గత వారం రోజులుగా ఈ పెన్నీ స్టాక్ ఏకంగా ఏడు శాతం లాభపడింది. అంతా బానే ఉన్నా ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ ఉంది.

**కంపెనీ వేరు.. చాక్లెట్ వేరు**

మనందరికీ తెలిసిన ఫేమస్ 'మెలొడీ' చాక్లెట్‌ను తయారు చేసేది 'పార్లే ప్రొడక్ట్స్' అనే ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ. పార్లే-జి బిస్కెట్లు, మొనాకో, మ్యాంగో బైట్ వంటి బ్రాండ్లు అన్నీ ఈ సంస్థవే. ఇది పూర్తిగా ప్రైవేట్ కంపెనీ. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాలేదు. కానీ ఇన్వెస్టర్లు మాత్రం మార్కెట్లో లిస్టైన 'పార్లే ఇండస్ట్రీస్' అనే ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్ కంపెనీని చూసి.. అదే చాక్లెట్ కంపెనీ అనుకుని ఎగబడి కొనేశారు.

**సోషల్ మీడియా తెచ్చిన తిప్పలు**

ట్రెండింగ్‌లో ఉన్న వార్తలను, సెలబ్రిటీల కామెంట్లను చూసి గుడ్డిగా ఇన్వెస్టర్లు ఎలా మోసపోతున్నారో చెప్పడానికి ఈ ఘటనే ఓ ఉదాహరణ. సోషల్ మీడియాలో 'పార్లే మెలొడీ' ట్రెండ్ అవగానే కనీసం బ్యాగ్రౌండ్ చెక్ చేసుకోకుండా ట్రేడర్లు మార్కెట్లోకి దూకేశారు. ఇలాంటి తప్పుడు అంచనాల వల్ల తక్కువ ధర ఉండే పెన్నీ స్టాక్స్ ఒక్కోసారి అకస్మాత్తుగా పెరిగిపోతుంటాయి.

## పాక్ పై చారిత్రక సిరీస్ విజయం..

### డబ్ల్యూటీసీ స్టాండింగ్స్‌లో భారత్‌ను దాటేసిన బంగ్లాదేశ్




పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ అద్భుత ప్రదర్శనతో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. సిల్హెట్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ విజయంతో ఐసీసీ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2027 స్టాండింగ్స్‌లో బంగ్లాదేశ్ అనూహ్యంగా భారత్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానానికి ఎగబాకింది. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ విన్-లాస్ పర్సంటేజ్ 58.33 శాతానికి చేరుకుంది. దీంతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. మరోవైపు ఇప్పటివరకు 9 టెస్టులాడి 4 విజయాలు, 4 ఓటములు, ఒక డ్రాతో 48.15 శాతం పాయింట్లతో ఉన్న టీమిండియా ఆరో స్థానానికి పడిపోయింది. ఈ సిరీస్‌లో ఓటమితో పాకిస్థాన్ ఎనిమిదో స్థానంలోనే కొనసాగుతోంది. ఈ ఏడాది భారత్ ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడలేదు. త్వరలో ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్టు ఆడనున్నా, అది డబ్ల్యూటీసీ సైకిల్‌లో భాగం కాదు. ఇవాళ మ్యాచ్ చివరి రోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే బంగ్లాదేశ్ బౌలర్లు పాకిస్థాన్ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికారు. 437 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 316/7తో ఐదో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్థాన్, మరో 42 పరుగులు మాత్రమే జోడించి 358 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్ (94) చివరి వరకు పోరాడినప్పటికీ, సెంచరీకి కేవలం ఆరు పరుగుల దూరంలో ఔటయ్యాడు. రిజ్వాన్ ఔటైన తర్వాత పాక్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో బంగ్లా స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ 6 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించాడు. చివరి రోజు రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా ప్రమాదకరంగా మారుతున్న రిజ్వాన్‌ను షోరిఫుల్ ఇస్లామ్ ఔట్ చేయడంతో బంగ్లా విజయం ఖాయమైంది. పాకిస్థాన్‌పై స్వదేశంలో బంగ్లాదేశ్‌కు ఇదే మొట్టమొదటి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 2024లో పాకిస్థాన్ గడ్డ పై 2-0తో సిరీస్ గెలిచిన బంగ్లా, ఇప్పుడు స్వదేశంలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది.

## సూర్యవంశీ పై లక్నో ఓనర్ గోయెంకా ప్రశంసలు



ఐపీఎల్ 2026 సీజన్ ప్లే ఆఫ్ రేసులో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుకు చెందిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 38 బంతుల్లో 10 సిక్సర్లు, 7 ఫోర్లతో 93 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌కు ముగ్ధుడైన లక్నో ఫ్రాంచైజీ అధినేత సంజీవ్ గోయెంకా... స్టేడియం స్టాండ్స్‌లో స్వయంగా నిలబడి చప్పట్లతో వైభవ్‌కు అభినందనలు తెలిపారు. అంతేకాకుండా, మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఈ యువ ఆటగాడితో ఆయన ప్రత్యేకంగా ముచ్చటించారు. “ఈ ప్రపంచం ఇప్పటికే అతనిలోని ప్రతిభను చూసింది.. ఈ దేశం అతనిలో గొప్ప భవిష్యత్తును చూస్తోంది.. అతని భుజాలపై ఉన్న బాధ్యతను మోయగల సమర్థత అతనికి ఉంది” అంటూ సంజీవ్ గోయెంకా ఎక్స్ వేదికగా కొనియాడారు. మ్యాచ్ అనంతరం వైభవ్‌తో గోయెంకా మాట్లాడిన దృశ్యాలను చూసి, సునీల్ గవాస్కర్ వంటి కామెంటేటర్లు సరదాగా 'గోయెంకా త్వరలోనే వైభవ్ కోసం వేలంలో భారీగా బిడ్ వేయబోతున్నారు' అని వ్యాఖ్యానించడం ఆసక్తికరంగా మారింది.

# స్పోర్ట్స్

## భారత టీ20 కెప్టెన్ రేసులో శ్రేయస్ అయ్యర్: రికీ పాంటింగ్



భారత టీ20 జట్టు తదుపరి కెప్టెన్ రేసు పై పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కేవలం జట్టులోకి పునరాగమనం చేయడమే కాకుండా.. సూర్యకుమార్ యాదవ్ తర్వాత భారత టీ20 జట్టుకు కెప్టెన్ అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయని పాంటింగ్ మద్దతు ప్రకటించాడు.

**రేసులో అయ్యర్**

భారత టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్ ముందున్నాడని రికీ పాంటింగ్ స్పష్టం చేశాడు. ఐపీఎల్ టోర్నీ ప్రారంభంలో అయ్యర్ ఎంతటి నాణ్యమైన ఆటగాడో అందరం చూశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మైదానం, వెలుపలా అతడు ఉన్న స్థితిని బట్టి చూస్తే కెప్టెన్సీకి సరైన ఎంపికగా కనిపిస్తున్నాడని అభిప్రాయపడ్డాడు.

**ఆటలో పరిణతి**

అయ్యర్ తన కెరీర్‌లో మునుపెన్నడూ లేనంత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడని పాంటింగ్ కొనియాడాడు. ప్రస్తుతం అతడు తన ఆటపై పూర్తి నియంత్రణతో ఉన్నాడని చెప్పాడు. ఐపీఎల్ లాంటి సుదీర్ఘమైన లీగ్‌లో 14 మ్యాచ్‌ల పాటు ఒకే రకమైన స్థిరత్వాన్ని కొనసాగించడం ఎవరికైనా కష్టమేనని, వ్యక్తిగతంగానూ, జట్టుగానూ హెచ్చుతగ్గులు రావడం సహజమే నని అయ్యర్ ఇటీవలి పేలవ ఫామ్‌ను సమర్థించాడు.

# ‘డ్రాగన్’లో ‘లూగర్’గా ఎన్టీఆర్.. ఆ పేరు వెనుక అంత అర్థం ఉందా



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రానికి ‘డ్రాగన్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ పాత్ర పేరును ‘లూగర్’గా పరిచయం చేయడం అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో హీరోల పేర్లను శక్తిమంతంగా తీర్చిదిద్దుతారన్న విషయం తెలిసిందే. ‘కేజీఎఫ్’లో రాకీ, ‘సలార్’లో దేవా మాదిరిగానే ‘డ్రాగన్’లో ఎన్టీఆర్ పాత్రకు ‘లూగర్’ అనే పేరు పెట్టడం వెనుక ప్రత్యేక కారణం ఉన్నట్టు తెలుస్తోంది. ‘లూగర్’ అనేది ప్రపంచ యుద్ధాల కాలంలో జర్మనీ సైన్యం వాడిన ఒక క్లాసిక్ పిస్టల్. అత్యంత కచ్చితమైన లక్ష్యానికి, ప్రాణాంతకమైన వేగానికి ఇది ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో సినిమాలో ఎన్టీఆర్ పాత్ర కేవలం ఒక వ్యక్తిలా కాకుండా, శత్రువులను వేటాడే ఆయుధంలా ఉండబోతోందని ఈ పేరు సూచిస్తోంది. కాగా, ఈ విషయంపై చిత్రబృందం ఇంకా స్పందించలేదు. అయితే, ‘లూగర్’ అనే పదానికి గూగుల్, వికిపిడియాలో మాత్రం ఈ అర్థం కనిపిస్తుంది. ఈ చిత్రం 1967 కాలం నాటి అంతర్జాతీయ ఓపియం (నల్లమందు) స్మగ్లింగ్ మాఫియా నేపథ్యంలో సాగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. బ్రిటిష్ వారు దేశం విడిచి వెళ్లాక, ఓపియం వ్యాపారం ‘ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ’, ‘గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ’లుగా విడిపోతుంది. ఈ రెండు కంపెనీల మధ్య ఆధిపత్య పోరు, రక్తపాతం చుట్టూ కథ నడుస్తుంది. ఇందులో ఎన్టీఆర్ ‘ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ’కి చెందిన ‘అసాసిన్–ఇన్–చీఫ్’గా కనిపించనున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత కథానాయికగా నటిస్తుండగా, నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ ‘రఘువీర్ రాథోడ్’ అనే కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది.

## ఆసుపత్రి వద్ద కెమెరాలు చూసి చిర్రెత్తిపోయిన సల్మాన్ ఖాన్



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ పాపరాజీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ముంబైలోని ఓ ఆసుపత్రి వద్ద తనను చుట్టుముట్టిన ఫొటోగ్రాఫర్ల తీరుపై మండిపడ్డాడు. ‘మీకు పిచ్చెక్కిందా?’ (పాగల్ హో క్యా?) అంటూ సీరియస్ అయ్యాడు. ఈ ఘటన మంగళవారం ముంబైలోని మహిమ్ ప్రాంతంలో ఉన్న హిందూజా ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది. ఆసుపత్రి నుంచి బయటకు వస్తున్న సల్మాన్‌ను ఫొటోగ్రాఫర్లు చుట్టుముట్టారు. ఆయన తన కారు వైపు వెళ్తుండగా ఒక్కసారిగా ఆగి వెనక్కి తిరిగి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పద్ధతిగా ప్రవర్తించాలని హెచ్చరించాడు. సల్మాన్ తీవ్ర స్వరంతో మాట్లాడటంతో ఫొటోగ్రాఫర్లు వెంటనే క్షమాపణలు చెప్పి వీడియో తీయడం ఆపేశారు. అయితే, సల్మాన్ ఖాన్ ఎవరిని పరామర్శించడానికి ఆసుపత్రికి వెళ్లారనే విషయంపై స్పష్టత రాలేదు. కాగా, తాను ఒంటరిగా ఉన్నానంటూ వస్తున్న వార్తలపై సల్మాన్ ఇటీవల స్పందించిన విషయం తెలిసిందే. తనకు పెద్ద కుటుంబం, స్నేహితులు ఉన్నారని, తాను ఒంటరిని కాదని స్పష్టం చేశాడు. కొన్నిసార్లు ఎక్కువ మందితో ఉండి తన సోషల్ బ్యాటరీ అయిపోతుందని, అందుకే కొంత ‘మీ టైమ్’ తీసుకుంటానని తన ఎక్స్ ఖాతాలో వివరించాడు. ఈ నేపథ్యంలోనే ఆయన పాపరాజీ పై అసహనం వ్యక్తం చేసి ఉండవచ్చని భావిస్తున్నారు.

## బాలయ్య సినిమాలో మంచు మనోజ్.. తన గాడ్ ఫాదర్ అంటూ మనోజ్ భావోద్వేగం



నందమూరి బాలకృష్ణ, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం నుంచి టాలీవుడ్‌ను ఊపేసే ఒక సెన్సేషనల్ అప్‌డేట్ బయటకు వచ్చింది. గతంలో వీరి కలయికలో వచ్చిన ‘వీరసింహారెడ్డి’ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరోవైపు, నటుడు మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి ఆహ్వానిస్తూ చిత్ర బృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగమవడంపై మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తన జీవితంలో ఎంతో ఆశగా కోరుకున్న అత్యంత ప్రత్యేకమైన బహుమతి ఈ పుట్టినరోజున లభించిందని, తన గాడ్ ఫాదర్, లయన్ నందమూరి బాలకృష్ణతో కలిసి నటించాలనే ఎన్నో ఏళ్ల నిరీక్షణ, కల ఈ సినిమాతో నిజమవుతోందని రాసుకొచ్చారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు చేసినా బాలయ్య అన్నతో, గోపీచంద్ మలినేని గారితో ఉన్న అనుబంధం వల్ల ఈ సినిమా తన హృదయంలో ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాగే థియేటర్లలో ప్రేక్షకులకు ఒక పెద్ద పండగ లాంటి విందు ఉండబోతోందని, చూసే ప్రతి క్షణం ఈ నిరీక్షణకు తగినట్టుగా ఉంటుందని అభిమానులకు మనోజ్ పక్కా ప్రామిస్ చేశారు. అయితే, ఈ సినిమాలో మనోజ్ పోషిస్తున్న పాత్రపై చిత్ర బృందం ఇంకా సస్పెన్స్ కొనసాగిస్తున్నప్పటికీ, ఆయన ఒక పవర్‌ఫుల్ విలన్ పాత్రలో బాలయ్యను ఢీకొట్టబోతున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో ‘మిరాయ్’, ‘భైరవం’ వంటి చిత్రాల్లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతో వరుస విజయాలు అందుకున్న మనోజ్... ఇప్పుడు బాలకృష్ణలాంటి అగ్ర హీరో సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. గతంలో మనోజ్ నటించిన ‘ఊ కొడతారా.. ఉలిక్కి పడతారా’ చిత్రంలో బాలయ్య ఒక పవర్‌ఫుల్ రోల్ చేయగా, ఇప్పుడు బాలయ్య సినిమా కోసం మనోజ్ ఏకంగా విలన్‌గా రంగంలోకి దిగడం ఈ ప్రాజెక్ట్ పై అంచనాలను డబుల్ చేసింది.

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రెస్ నోట్... క్లారిటీ ఇచ్చిన నిర్మాత సురేష్ బాబు



తెలుగు ఫిల్మ్ ఛాంబర్ పేరుతో ‘పెద్ది’ సినిమా విడుదల పై సోషల్ మీడియాలో వైరల్ అయిన ప్రెస్ నోట్‌పై అధ్యక్షుడు, నిర్మాత డి.సురేష్ బాబు స్పందించారు. ఆ ప్రెస్ నోట్ ఫేక్ అని, ఛాంబర్ నుంచి తాము అధికారికంగా ఎలాంటి ప్రకటన జారీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ‘పెద్ది’ సినిమా ప్రదర్శనకు ఎగ్జిబిటర్లు అందరూ ఆమోదం తెలిపారని, ఆ చిత్రానికి లైన్ క్లియర్ అయిందంటూ ఓ ప్రెస్ నోట్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’లో విస్తృతంగా ప్రచారమైంది. అయితే, దీనిపై స్పందించిన సురేష్ బాబు, ఆ నోట్‌తో ఛాంబర్‌కు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పర్సంటేజీ విధానంపై ఛాంబర్ ఇంకా అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన వివరించారు. కొంతకాలంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య పర్సంటేజీ విధానంపై చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి ఓ ప్రత్యేక కమిటీ కూడా ఏర్పాటైంది. ఈ క్రమంలో సోమవారం ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో అద్దె, పర్సంటేజీ విధానంపై సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్టు వార్తలు వచ్చాయి. ‘పెద్ది’ చిత్రాన్ని అద్దె విధానంలో ప్రదర్శించలేమని కొందరు ఎగ్జిబిటర్లు చెప్పినట్లు తెలిసింది. ఈ వాడివేడి చర్చల అనంతరం, సురేష్ బాబు సంతకం లేకుండా ఈ ఫేక్ ప్రెస్ నోట్ బయటకు రావడం గమనార్హం. మొత్తంగా, ‘పెద్ది’ చిత్ర విడుదల పై ఎలాంటి అడ్డంకులు లేవని వచ్చిన వార్తలు అవాస్తవమని ఫిల్మ్ ఛాంబర్ స్పష్టం చేసింది.

## ఎన్టీఆర్ బర్త్‌డే.. అర్ధరాత్రి తారక్ ఇంటి వద్ద జనసంద్రం.. అభిమానుల సంబరాలు వేరే లెవెల్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు అంబరాన్నంటాయి. అటు అభిమానుల కోలాహలం, ఇటు కొత్త సినిమా అప్డేట్‌తో సోషల్ మీడియా హోరెత్తుతోంది. మే 19 అర్ధరాత్రి 12 గంటలు దాటగానే హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. తమ అభిమాన నటుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. ‘జై ఎన్టీఆర్’ అంటూ నినాదాలు చేస్తూ, బాణసంచా కాలుస్తూ పండగ వాతావరణాన్ని సృష్టించారు. అభిమానుల ప్రేమకు స్పందించిన తారక్, ఇంటి బయటకు వచ్చి అభివాదం చేస్తూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి.



**‘డ్రాగన్’గా ఎన్టీఆర్ మాస్ అవతారం!**

మరోవైపు ఎన్టీఆర్ అభిమానులకు బర్త్‌డే కానుకగా ఆయన నటిస్తున్న ‘డ్రాగన్’ చిత్రం నుంచి పవర్‌ఫుల్ గ్లింప్స్ విడుదలైంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా గ్లింప్స్‌లో ఎన్టీఆర్ సరికొత్త మాస్ అవతారంలో కనిపించారు. గణనీయంగా బరువు తగ్గి, రగ్గడ్ గడ్డం, వైల్డ్ హెయిర్ స్టైల్‌తో ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. దాదాపు 4 నిమిషాల నిడివి గల ఈ వీడియోలో ఎన్టీఆర్ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్, రవి బస్రూర్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ గ్లింప్స్ విడుదలైన కొద్ది క్షణాల్లోనే ట్రెండింగ్‌లోకి వచ్చింది.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143